teenmaardesk@gmail.com

RNI no TELTEL/2021/86151

# తీన్మార్

నేటి వాస్తవాలు... తెలుగు దిన పత్రిక

ములుగు | సంపుటి : 02 | సంచిక : 344 | చీఫ్ ఎడిటర్ : రెడ్డి శేఖర్ | బుధవారం | 27 మార్చి 2024 | పేజీలు : 08 | వెల ‘5

Published from Mulugu Circulated by Warangal, Khammam, Hyderabad, Nalgonda, Mahabubnagar, Rangareddy,Medak, Karimnagar,Nizamabad, Adilabad.




## హోం గ్రౌండ్‌లో సన్ రైజర్స్ మ్యాచ్

### సత్తా చాటేందుకు సిద్ధమవుతున్న సన్ రైజర్స్

తెలంగాణ బ్యూరో, మార్చి 26 (తీన్మార్ న్యూస్): ఐపీఎల్ 2024 17వ సీజన్ లో భాగంగా సన్ రైజర్స్ హైదరాబాద్ తమ హెూం గ్రౌండ్ ఉప్పల్ స్టేడియంలో బుధవారం మ్యాచ్ ఆడనుంది. మొదటి మ్యాచ్‌లో పోరాడి పరాజయం పాలైనప్పటికీ ఈసారి హెూమ్ గ్రౌండ్ లో సత్తా చాటేందుకు సిద్ధం అవుతుంది. దీంతో బుధవారం మ్యాచ్ కోసం ప్రేక్షకులు ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. ఈ క్రమంలో ఉప్పల్ స్టేడియంలో బుధవారం రాత్రి సన్ రైజర్స్

మిగతా 2 లో



## తీహార్ జైలుకి ఎమ్మెల్సీ కవిత

ప్రత్యేక సౌకర్యాలు ఏర్పాటు అనుమతి ఇచ్చిన కోర్ట్

ఈ మేరకు జైలు సూపరింటెండెంట్కు న్యాయస్థానం ఆదేశాలు జారీ

తీన్మార్ బ్యూరో మార్చి 26 (తీన్మార్ న్యూస్) : ఢిల్లీ లిక్కర్ స్కాం కేసులో అరెస్ట్ అయిన ఎమ్మెల్సీ కవితకు 14 రోజుల జ్యుడిషియల్ రిమాండ్ విధించారు.తీహార్ జైల్లో ఉన్న బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కవితకు రౌస్ అవెన్యూ ప్రత్యేక న్యాయస్థానం కొన్ని వెసులుబాట్లు కల్పించింది. కవిత విజ్ఞప్తి మేరకు ఈ వెసులుబాట్లు ఇచ్చింది. ఈ మేరకు తీహార్ జైలు సూపరింటెండెంట్కు న్యాయస్థానం ఆదేశాలు జారీ చేసింది. కవితకు ఇంటి భోజనం తెచ్చుకోవడానికి కోర్టు అనుమతి ఇచ్చింది. అలాగే జైల్లో పడుకోవడానికి మంచం, పరుపు, చెప్పులు, బట్టలు, దుప్పట్లు, పుస్తకాలను స్వయంగా ఏర్పాటు చేసుకోవడానికి కూడా కోర్టు అనుమతి ఇచ్చింది.





# అడుగంటిన జలాశయాలు

## సెగలు చిమ్ముతున్న ఉష్ణోగ్రతలు

### రిజర్వాయర్లలో పెరుగుతున్న నీటి ఆవిరి శాతం

### రోజురోజుకు అడుగంటుతోన్న జూరాల జలాశయం

### సాగర్ జలాశయంలో డెడ్‌స్టోరేజికి నీటినిల్వ



**మార్చి మాసంలోనే తెలంగాణలో ఉష్ణోగ్రతలు మండు వేసవిని తలపిస్తున్నాయి. సెగల ధాటికి ప్రధాన జలాశయాల్లో నీటి నిల్వలు వేగంగా తరిగిపోతున్నాయి. ఉన్న కొద్దిపాటి నీటిపై వేసవి అవసరాల దృష్టా పొదుపు చర్యలు తీసుకుంటుంటే ..మరోవైపు సెగలు చిమ్ముతున్న ఉష్ణోగ్రతల ధాటికి రిజర్వాయర్లలో నీటి అవిరి శాతం పెరుగుతూ వస్తోంది.**

తెలంగాణ బ్యూరో, మార్చి 26 (తీన్మార్ న్యూస్): తెలుగు రాష్ట్రాలకు జీవనాడులుగా ఉన్న కృష్ణా, గోదావరి ,పెన్నా నదుల పరివాహకంగా ఉన్న 14 ప్రధాన జలాశయాల్లో నీటి నిలువలు రోజురోజుకు తరిగిపోతున్నాయి. ఈ జలాశయాల్లో గరిష్ట స్థాయి నీటినిలువల్లో 70శాతం పైగా ఖాళీ అయ్యాయి. వీటిలో పూర్తి స్థాయి నీటినిలువ సామర్థం 963 టీఎంసీలు కాగా, ప్రస్తుతం వీటిలో నీటినిలువ 295టిఎంసీలకు

మిగతా 2 లో

## రాష్ట్రంలో ప్రధానమంత్రి ఫసల్ బీమా యోజన అమలుకు అడుగులు

కాంగ్రెస్ ప్రభుత్వ వినతికి సానుకూలంగా స్పందించిన కేంద్ర ప్రభుత్వం

వానాకాలం నుండి పథకాన్ని అమలు చేయాలని నిర్ణయం




**లోక్ సభ ఎన్నికల వేల తెలంగాణ ప్రజలకు కేంద్రం శుభవార్త చెప్పింది. తెలంగాణ రాష్ట్రంలో ప్రధానమంత్రి ఫసల్ బీమా యోజన అమలు చేయాలంటూ కాంగ్రెస్ ప్రభుత్వం చేసిన వినతికి కేంద్ర ప్రభుత్వం సానుకూలంగా స్పందించింది.**

తెలంగాణ బ్యూరో, మార్చి 26 (తీన్మార్ న్యూస్): వచ్చే ఖరీఫ్ సీజన్ నుండి ఫసల్ బీమా అమలు చేసే అవకాశం ఉంది. ఈ పథకం రైతులకు అనుకూలంగా లేదని బీఆర్ఎస్ ప్రభుత్వం వ్యతిరేకించగా కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేయడానికి సిద్ధం అయ్యింది. వచ్చే వానాకాలం నుంచి ఈ పథకాన్ని రాష్ట్రంలో అమలు చేయాలని ప్రభుత్వం నిర్ణయిస్తూ, అనుమతి కోరుతూ

మిగతా 2 లో



## కస్టడీ నుంచి కేజ్రీవాల్ ఇస్తున్న ఆదేశాలపై ఈడీ సీరియస్

ఆదేశాల జారికి సౌకర్యాలు సమకూర్చలేదని పేర్కొని దర్యాప్తు సంస్థ

.. వివరాలు 2లో



## ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధికి విద్యాశాఖ కీలక నిర్ణయం

విడుదల చేయనున్న ఎమర్జెన్సీ అండ్ మెయింటనెన్స్ ఫండ్

అవసరమైన సౌకర్యాలు కల్పనకు చిన్నపాటి రిపేర్లు

.. వివరాలు 2లో

## బీజేపీకి నచ్చినోళ్లు జేబుల్లో ఉండాలి.. నచ్చనోళ్లు జైల్లో ఉండాలి

### బీజేపిపై నిప్పులు చెరిగిన సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు

### కేసీఆర్ బీజేపీతో ఎప్పుడూ కలిసేది లేదు

సంగారెడ్డి, మార్చి 26 (తీన్మార్ న్యూస్): కేంద్రంలో అధికారంలో ఉన్న భారతీయ జనతా పార్టీపై సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు నిప్పులు చెరిగారు. బీజేపీకి నచ్చినోళ్లు వారి జేబుల్లో ఉండాలి. నచ్చనోళ్లు జైల్లో ఉండాలి.. కవితతో పాటు కేజ్రీవాల్‌ను అరెస్టు చేశారు. లొంగకపోతే ప్రతిపక్ష పార్టీల మీద కేసులు పెట్టి వేధింపులకు గురి చేస్తున్నారని హరీశ్‌రావు మండిపడ్డారు. సంగారెడ్డిలో ఏర్పాటు చేసిన మెదక్ పార్లమెంట్ సమావేశంలో హరీశ్‌రావు పాల్గొని ప్రసంగించారు. కేసీఆర్ బీజేపీతో ఎప్పుడూ కలిసేది లేదు. బీఆర్ఎస్ లౌకిక పార్టీ అని హరీశ్‌రావు స్పష్టం చేశారు. అసెంబ్లీ ఎన్నికల ముందు బీజేపీ, బీఆర్ఎస్ ఒక్కటే అని ప్రచారం చేశారు. కానీ ఇవాళ ఏం జరుగుతుందో మీరంతా చూస్తున్నారు. బీజేపీ ఏ ఒక్కరిలోనూ మార్పు తేలేదు. బీఆర్ఎస్

మిగతా 2 లో





ఆన్‌లైన్‌ఎగ్జామ్ నేపథ్యంలోనే పెంచామంటున్న ఆఫీసర్లు

తీవ్ర ఆందోళన చెందుతున్న అభ్యర్థులు

## టెట్ ఫీజు తగ్గించాలని పెరుగుతున్న విజ్ఞప్తులు

తెలంగాణ బ్యూరో, మార్చి 26 (తీన్మార్ న్యూస్): తెలంగాణ స్టేట్ టీచర్ ఎలిజిబిలిటీ టెస్ట్ (టెట్-)-2024 అప్లికేషన్ల ప్రక్రియ బుధవారం నుంచి ప్రారంభం కానుంది. ఈ నెల 27 నుంచి ఏప్రిల్ 10 వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకునేందుకు విద్యాశాఖ అవకాశం కల్పించింది. ఫీజును ఆన్‌లైన్‌లో పే చేసిన తర్వాత దరఖాస్తు ప్రక్రియ ప్రారంభం కానుంది. గతేడాది ఫిజికల్‌గా టెట్ పరీక్ష నిర్వహించగా ఒక్క పేపర్ లేదా రెండు పేపర్లు రాసినా రూ.400 మాత్రమే ఫీజు ఉండేది. ఈసారి ఆన్‌లైన్‌లో టెట్

మిగతా 2 లో

## శరణ్ చౌదరి ఎవరో నాకు తెలియదు

40 ఏళ్లుగా రాజకీయాల్లో వున్నా..

ఎక్కడా భూకబ్జాలకు పాల్పడలేదు

కేసుకు నాకు సంబంధం లేదు

పార్టీ మారాలని నాపైపై నుంచి ఒత్తిడులు వస్తున్నాయి

శరణ్ చౌదరి ఆరోపణలపై స్పందించిన ఎర్రబెల్లి దయాకర్

వివరాలు 2 లో



# రాష్ట్రంలో ప్రధానమంత్రి ఫసల్ బీమా యోజన అమలుకు అడుగులు

మొదటి పేజీ తరువాయి

కేంద్రానికి లేఖ రాసింది. దీనికి కేంద్రం గ్రీన్‌సిగ్నల్ ఇచ్చిందని వ్యవసాయశాఖ వర్గాలు తెలిపాయి. ఆహార ధాన్యాల పంటలకు 2 శాతం, వాణిజ్య పంటలకు 5 శాతం ప్రీమియం చెల్లిస్తే ఏదైనా నష్టం వచ్చినప్పుడు పరిహారం అందనుంది. ఈ పథకం అమలు చేయాలంటే తక్షణమే పథకాన్ని అమలు చేసే కంపెనీలను టెండర్ల ద్వారా ఆహ్వానించాలి. దీనికి నోటిఫికేషన్ జారీ చేయాల్సి ఉంటుంది. ఎన్నికల కోడ్ అమలులో ఉన్నందున ఇప్పుడు టెండర్ నోటిఫికేషన్ ఇవ్వాలంటే ఎన్నికల కమిషన్ పర్మిషన్ తప్పనిసరి. ఒకవేళ ఈసీ అనుమతి ఇవ్వకుంటే ఈ పథకం వచ్చే సీజన్ నుంచి అమలు అయ్యే అవకాశాలు తక్కువగానే ఉన్నాయని అంటున్నారు అధికారులు. ఈ స్కీంతో నష్టం వస్తుందన్న ఆందోళన నుంచి రైతులకు ఉపశమనం లభించనుంది.

# కస్టడీ నుంచి కేజ్రీవాల్ ఇస్తున్న ఆదేశాలపై ఈడీ సీరియస్

ఢిల్లీ, మార్చి 26 (తీన్మార్ న్యూస్): ఢిల్లీ లిక్కర్ పాలసీ కేసులో మనీలాండరింగ్ ఆరోపణలపై అరెస్టయిన ఢిల్లీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్ ప్రస్తుతం ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ కస్టడీలో ఉన్నారు. అయితే, లాకప్ నుంచే ఆయన పాలన సాగిస్తుండటం చర్చనీయాంశమైంది. ఈ తరుణంలో ఆయన రెండో ఆదేశం జారీ చేయగా కస్టడీ నుంచి ఆయన ఇస్తున్న ఆదేశాలపై ఈడీ సీరియస్ అయినట్లు తెలుస్తోంది. మంగళవారం ఉదయం లాకప్ నుంచి కేజ్రీవాల్ రెండో ఆదేశాలు జారీ చేసినట్లు ఆప్ నేత, ఢిల్లీ ఆరోగ్య మంత్రి సౌరభ్ భరద్వాజ్ వెల్లడించారు. మొహల్లా క్లినిక్‌లలో ఉచిత ఔషధాల కొరత ఉండకుండా చూసుకోవాలని సీఎం ఉత్తర్వుల్లో పేర్కొన్నట్లు ఆరోగ్య మంత్రి తెలిపారు. కస్టడీలో ఉన్నప్పటికీ సీఎం ప్రజల ఆరోగ్యం గురించి ఆలోచిస్తున్నారు అని సౌరభ్ పేర్కొన్నారు. ఇటీవల ఆయన నీటి సమస్య నివారణ కోసం సహచర మంత్రి ఆతిశీకి నోట్ ద్వారా ఉత్తర్వులిచ్చిన సంగతి తెలిసిందే. దీన్ని ఈడీ తీవ్రంగా పరిగణించింది. కస్టడీ సమయంలో ప్రధాన కార్యాలయంలో ఉన్న కేజ్రీవాల్‌కు కంప్యూటర్ లేదా కాగితాలను తాము సమకూర్చలేదని దర్యాప్తు సంస్థ చెబుతోంది. ఆదేశాలు బయటకు ఎలా వెళ్లాయో తెలుసుకొనేందుకు చర్యలు చేపట్టింది. దీనిపై ఆతిశీని ప్రశ్నించే అవకాశముంది. అయితే ఇప్పటికే కేజ్రీవాల్ ఇచ్చిన తొలి ఆదేశాలపై బీజేపీ అభ్యంతరాలు వ్యక్తం చేసింది. అదే సమయంలో కంప్యూటర్, పేపర్ అందుబాటులో లేని కేజ్రీవాల్ ఆదేశాలు ఎలా జారీ చేశారా.. అనే అంశంపై ఈడీ దర్యాప్తు చేపట్టింది. ఇంతలోనే మరో ఆదేశం విడుదల కావడం.. దాన్ని ఆప్ గర్వంగా ప్రకటించుకోవడాన్ని ఈడీ తీవ్రంగా పరిగణిస్తున్నట్లు తెలుస్తోంది.

# బీజేపీకి నచ్చినోళ్లు జేబుల్లో ఉండాలి.. నచ్చనోళ్లు జైల్లో ఉండాలి

మొదటి పేజీ తరువాయి



గెలవాలి, తెలంగాణ నిలవాలి అనే నినాదంతో ఎన్నికల ప్రచారం చేయాలి. తెలంగాణ కోసం నిఖార్సుగా పోరాడే పార్టీ బీఆర్ఎస్. కాంగ్రెస్, బీజేపీకి 100 ఎజెండాలు ఉంటాయి. వారి అవసరాల కోసం కాంప్రమైజ్ అవుతాయి. తెలంగాణ హక్కుల కోసం ఎలాంటి రాజీ లేకుండా పోరాటం చేసే పార్టీ బీఆర్ఎస్ అని ప్రజల్లోకి తీసుకోవాలి. రాత్రింబవళ్లు కష్టపడి గులాబీ జెండాను గెలిపించుకుందాం అని హరీశ్‌రావు పిలుపునిచ్చారు. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో కేసీఆర్ ముస్లింలకు పెద్ద పీట వేశారని హరీశ్‌రావు గుర్తు చేశారు. డిప్యూటీ సీఎం, రెవెన్యూ , హెూం మినిస్టర్ పదవి ముస్లింలకు ఇచ్చారు. ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వంలో ముస్లిం మంత్రులెవరూ లేరు. గతంలో బడ్జెట్‌లో కూడా అధిక కేటాయింపులు చేశారు. రంజాన్ పర్వదినం సందర్భంగా ముస్లింలకు బట్టలు పంపిణీ చేశారు. మైనార్టీ రెసిడెన్షియల్ స్కూల్ ఏర్పాటు చేశారు. పిల్లలు గొప్పగా చదువుకుంటున్నారు. కాంగ్రెస్‌కు ఓటేస్తే లాభం లేదు. సెక్యులర్ పార్టీ బీఆర్ఎస్. సెక్యులర్ నాయకుడు కేసీఆర్. ప్రతిపక్ష ఎమ్మెల్యేలను కొనడం కాదు. ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయాలని కోరుతున్నాం. ప్రతిపక్ష నాయకులను బెదిరించి, అక్రమ కేసులు పెట్టి, కాంగ్రెస్ పార్టీలో చేర్చుకునేందుకు ప్రయత్నాలు చేస్తున్నారు. కాంగ్రెస్ పార్టీ మోసాలను తెలంగాణ ప్రజలు గ్రహిస్తున్నారు. వెంకట్రామిరెడ్డికి ఓట్లు వేసి భారీ మెజార్టీతో గెలిపించాలి అని హరీశ్‌రావు కోరారు.

# శరణ్ చౌదరి ఎవరో నాకు తెలియదు : ఎర్రబెల్లి

హైదరాబాద్, మార్చి 26 (తీన్మార్ న్యూస్): తనపై శరణ్ చౌదరి ఆరోపణలు చేశారని తన దృష్టికి వచ్చిందని ఆయన ఎవరో తెలియదని బీఆర్ఎస్ నేత, మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు స్పష్టం చేశారు. మంగళవారం ఆయన తెలంగాణ భవన్‌లో మీడియాతో మాట్లాడుతూ, శరణ్ చౌదరి బీజేపీలో ఉన్నాడని తెలిసింది. శరణ్ చౌదరి భూకబ్జాలకు పాల్పడ్డాడని బీజేపీ పార్టీ నుంచి సస్పెండ్ చేసిందని ఎర్రబెల్లి అన్నారు. దొంగ డాక్యుమెంట్లు సృష్టించి శరణ్ చౌదరి భూకబ్జాలకు పాల్పడ్డారు. ఎన్.ఆర్.ఐ.విజయ్‌కు, శరణ్ చౌదరి రెండు కోట్లు బాకీ వున్నారు శరణ్ చౌదరిపై చాలా కేసులు వున్నాయి. శరణ్ చౌదరి డబ్బులు ఇవ్వాల్సిన విజయ్ ఎవరో నాకు పరిచయం లేదు. శరణ్ చౌదరి, అతని భార్య పాస్ పోర్టులను పోలీసులు సీజ్ చేశారు. నేను 40 ఏళ్లుగా రాజకీయాల్లో వున్నా ఎక్కడా భూకబ్జాలకు పాల్పడలేదు అని ఎర్రబెల్లి దయాకర్‌రావు చెప్పారు. బంజారాహిల్స్ పీఎస్ లో శరణ్ చౌదరి పై అనేక కేసులు ఉన్నాయి. ఈ వ్యవహారంలో నన్నెందుకు లాగుతున్నారో అర్థం కావడం లేదు. ఫోన్ ట్యాపింగ్ కేసుకు నాకు సంబంధం లేదు. ప్రణీత్ రావు ఎవరో కూడా తెలియదు. ప్రణీత్ రావు వాళ్ల బంధువులు మా ఊర్లో ఉంటారని తెలిసింది. రాజకీయ కుట్రలో భాగంగానే ఇలాంటి వ్యవహారాలు చేస్తున్నారు. నేను ప్రస్తుతం పార్టీ మారే ఉద్దేశ్యం లేదు. నేను పార్టీ మారను. పార్టీ మారాలని నాపై పై నుంచి ఒత్తిడులు వస్తున్నాయి అని దయాకర్‌రావు తెలిపారు. "శరణ్ చౌదరి డబ్బులు ఇవ్వాల్సిన విజయ్ నాకు బంధువు అని అసత్య ప్రచారం చేస్తున్నారు. నేను అనేక కేసులు ఎదుర్కొన్నాను. గతంలో ఓబుళాపురం అక్రమ మైనింగ్, బాబ్లీ ప్రాజెక్టు విషయంలో ప్రజల కోసం జైలుకు వెళ్లాను" అని ఎర్రబెల్లి పేర్కొన్నారు.

# అడుగంటిన జలాశయాలు

మొదటి పేజీ తరువాయి



పడిపోయింది. గత ఏడాది వేసవిలో ఈ సమయానికి ఈ జలాశయాల్లో 511టిఎంసీల నీరు నిలువ ఉండేది. గత ఏడాదితో పోలిస్తే వీటిలో నీటినిలువలు 216టిఎంసీలు తక్కువగా ఉన్నాయి. కృష్ణానది పరివాహకంగా ప్రధాన ప్రాజెక్టుల పరిస్థితి ఊస్సూరుమనిపిస్తోంది. రాష్ట్ర ముఖద్వారాంలో ఉన్న జూరాల జలాశయం రోజురోజుకు అడుగంటుతోంది. ఈ జలాశయంలో గరిష్టస్థాయి 9.66టిఎంసీలకు గాను ప్రస్తుతం 3.48టిఎంసీల నీరు నిలువ ఉంది. శ్రీశైలం జలాశయం మరింతగా అడుగంటిపోయింది. 215టీఎంసీల పూర్తి స్థాయి నీటినిల్వ సామర్థం ఉన్న ఈ జలాశయంలో నీటినిలువ 34టిఎంసీలకు తరిగిపోయింది. నీటిమట్టం కూడా 810అడుగుల డెడ్ స్టోరేజికి చేరుకుంది. గత ఏడాది ఈ జలాశయంలో నీటినిలువ ఈ సమయానికి 821అడుగుల వద్ద 41టిఎంసీల నీరు నిలువ ఉండేది. గత ఏడాదితో పోలిస్తే ఏడు టీఎంసీలు తక్కువగాఉంది. జలాశయంలో 179టీఎంసీల ఖాళీ ఏర్పడింది. దిగువన నాగార్జునసాగర్‌లో నీటిమట్టం మరింత వేగంగా తరిగి పోతోంది. సాగర్ జలాశయం విస్తరణ పరిధి అధికంగా ఉండటంతో ఎండల తీవ్రతకు నీటి అవిరి శాతం పెరుగూతూ వస్తోంది. జలాశయంలో 312టీఎంసీల గరిష్ట నీటినిలువ సామర్ధానికిగాను ప్రస్తుతం ఇందులో 139టిఎంసీల నీరు నిలువ ఉంది.నీటిమట్టం 513అడుగులకు చేరింది. మరో మూడు అడుగులు ఖాళీ అయితే ఇక సాగర్ జలాశయంలో నీటినిల్వ డెడ్‌స్టోరేజికి పడిపోనుంది. గత ఏడాది ఇందులో ఈ సమయానికి 191టిఎంసీల నీరు నిలువ ఉండేది. ఈ సారి 52టిఎంసీల నీరు తక్కువగా ఉంది. జలాశయం 172టీఎంసీల మేరకు ఖాళీ ఏర్పడింది. దిగువన ఉన్న పులిచింతల జలాశయాన్నికూడా ఎడా పెడా తోడేశారు. ఇందులో నీటినిల్వ 4.70టిఎంసీలకు పడిపోయింది. గరిష్ఠస్థాయి 45టిఎంసీల నిల్వ సామర్దం ఉన్న ఈ జలాశయంలో గత ఏడాది ఈ సమయానికి 42టిఎంసీల నీరు నిలువ ఉండేది. ప్రకాశం బ్యారేజి కింద ఏపిలో అవసరాల పేరుతో పులిచింతల నుంచి 40టిఎంసీల నీటిని తోడేశారు. కృష్ణాకు ప్రధాన ఉపనదిగా ఉన్న తుంగభద్ర నదీ ఇసుక తిన్నెలు తేలి ఎడారిని తలపిస్తోంది. తుంగభద్ర ప్రాజెక్టులో పూర్తి స్థాయి 105టిఎంసీల నిలువ సమార్ధానికిగాను ప్రస్తుతం ఇందులో 5టిఎంసీలు మాత్రమే ఉన్నాయి. గత ఏడాది ఈ సమయానికి ఇందులో 23టిఎంసీలు నిలువ వుండేవి. ఈ ఏడాది మొత్తంగా తుంగభద్ర నదిద్వారా తెలుగు రాష్ట్రాలకు 20టిఎంసీలకు మించి దక్కలేదు.

ఇక, గోదావరి నదిపరివాహకంగా జలాశయాలపై ఈ వేసవిలో మేడిగడ్డ ఎఫెక్ట్ గట్టిగానే పడింది. మేడిగడ్డ నుంచి ప్రాణహిత నదీజలాల ఎత్తిపోత ఆగిపోయవటంతో ఎగువన ఉన్న శ్రీరాంసాగర్ జలాశయంపైన నీటి వత్తిడి పెరిగిపోయింది. దీంతో శ్రీరాం సాగర్ జలాశయం ఇప్పటికే 80శాతం ఖాళీ అయిపోయింది. 90టీఎంసీల గరిష్ట నీటినిలువ సామర్థం ఉన్న ఈ జలాశయంలో ప్రస్తుతం 17టిఎంసీలు మాత్రమే మిగిలి ఉన్నాయి. గత ఏడాది ఈ సమయానికి ఇందులో 40టీఎంసీల మేరకు నీరు నిలువ ఉండేది. దిగువన శ్రీపాద ఎల్లంపల్లి జలాశయంలో 20టీఎంసీల గరిష్ట నీటినిలువ సామర్ధానికిగాను ఇందులో 8.72టిఎంసీల నీరు మిగిలివుంది. గత ఏడాది ఎల్లంపల్లిలో 17టిఎంసీల నీరు నిలువ వుండేది. నిజాంసాగర్‌లో 7టిఎంసీలు, సింగూరులో 20,కడెంలో 3, లోయర్‌మానేరులో 7, మిడ్‌మానేరులో12టీఎంసీల నీరు మిగిలివుంది. ఏపిలో ఉన్న వెలుగోడు రిజర్వాయర్‌లో 16టీఎంసీల గరిష్టస్థాయికిగాను 1.50టిఎంసీల నీరు నిలువ ఉంది.పెన్నానది పరివాహకంగా సోమశిలలో కూడా 77టిఎంసీల పూర్తి స్థాయి నీటినిలు సామర్ధానికిగాను 14టిఎంసీల నీరు మిగిలివుంది. గత ఏడా ఈ జలాశయంలో ఈ సమయానికి 58టిఎంసీల నీరు నిలువ ఉండేది. కండలేరులో కూడా 68టిఎంసీల పూర్తి స్థాయి నిలువ సామర్ధానికిగాను 9టిఎంసీలు మాత్రమే మిగిలివుంది. గత ఏడాది ఈ సమయానికి ఇందులో 43టిఎంసీలు నిలువ ఉండేది.

# ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధికి విద్యాశాఖ కీలక నిర్ణయం

తెలంగాణ బ్యూరో, మార్చి 26 (తీన్మార్ న్యూస్): తెలంగాణ రాష్ట్రంలోని ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధి విషయంలో రాష్ట్ర విద్యాశాఖ కీలక నిర్ణయం తీసుకుంది. పాఠశాలలకు అవసరమైన సౌకర్యాలు కల్పించడంతోపాటు చిన్నపాటి రిపేర్లను వేసవి సెలవుల లోపు పూర్తి చేసేందుకు ఎమర్జెన్సీ అండ్ మెయింటనెన్స్ ఫండ్ విడుదల చేయనుంది. ప్రభుత్వం కొత్తగా ఇచ్చే ఈ నిధులతో పాఠశాలలకు అవసరమైన ట్యూబ్ లైట్లు, బల్బులు, ఫ్యాన్లు, స్విచ్చులు, నీటి సరఫరా ఏర్పాట్లు చేసుకోవచ్చు. వీటన్నింటినీ ప్రభుత్వ బడుల్లో ఏర్పాటు చేయనున్న అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీలు చేపట్టనున్నాయి. కలెక్టర్ దగ్గర అందుబాటులో ఉన్న జిల్లా మినరల్ ఫౌండేషన్ ట్రస్ట్, స్పెషల్ డెవలప్‌మెంట్ ఫండ్ తోపాటు గ్రామీణ ఉపాధి హామీ పథకం నిధులను పాఠశాలల అభివృద్ధికి ఉపయోగించనున్నారు. వచ్చే జూన్ 10 లోపు అంటే వేసవి సెలవులలోపు పాఠశాలల మరమ్మతులను పూర్తి చేయాలన్న ఆలోచనతో ఉంది. దీనికి సంబంధించిన విధివిధినాలను కూడా రూపొందించింది. పాఠశాలల్లో చేపట్టిన లక్ష రూపాయల విలువైన వాటికి డైరెక్టుగా ఎంపీడీవోలే చెల్లింపులు చేయనున్నారు. అంతకుమించితే జిల్లా కలెక్టర్ల ద్వారా బిల్లులు పొందాల్సి ఉంటుందని అధికారులు వెల్లడించారు. కాగా, ప్రభుత్వ తీసుకున్న నిర్ణయం పాఠశాలల అభివృద్ధికి ఉపయోగపడుతుందని ఉపాధ్యాయ సంఘాల నేతలు, టీచర్లు హర్షం వ్యక్తం చేశారు. గత కొన్నేళ్ల నుంచి పాఠశాలల్లో అనేక సమస్యలు పేరుకుపోయాయంటున్నారు. చాలా పాఠశాలల్లో కనీసం తాగునీరు, క్లాస్ రూంలు, తలుపులు, కిటికీలు, వాష్ రూం క్లీనింగ్ వంటివి లేకపోవడంతో విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు. ప్రభుత్వ తాజా నిర్ణయంతో ఈ సమస్యలకు చరమగీతం పాడొచ్చని అంటున్నారు.

# ఉపాధి హామీ కూలీలకు దినసరి కూలీ పెంచనున్న కేంద్రం

### *ఏప్రిల్ 1వ తేదీ నుంచి అమల్లోకి రానున్న కొత్త కూలి*



తెలంగాణ బ్యూరో, మార్చి 26 (తీన్మార్ న్యూస్): ఉపాధి హామీ పథకం కూలీలకు కేంద్ర ప్రభుత్వం శుభవార్త చెప్పింది. ప్రస్తుతం అందజేస్తున్న దినసరి కూలీ డబ్బులను పెంచనున్నట్లు పేర్కొంది. దీంతో దేశ వ్యాప్తంగా కోట్ల మందికి లబ్ధి చేకూరనుంది. ఏప్రిల్ 1వ తేదీ నుంచి కొత్త కూలి అమల్లోకి వస్తుంది. 2005లో మహాత్మాగాంధీ జాతీయ ఉపాధిహామీ పథకాన్ని కేంద్రప్రభుత్వం ప్రారంభించింది. పథకం ప్రారంభంలో దినసరి కూలి 87.50 రూపాయలు ఉండగా.. ప్రస్తుతం 272 రూపాయలు చెల్లిస్తున్నారు. ఎండా కాలంలో 3 నెలల పాటు ఉపాధి పనులు పుష్కలంగా దొరుకుతాయి. కూలీలు పొద్దున్న, సాయంత్రం రెండు పూటలా పనులు చేసుకోవడానికి ఛాన్స్ ఉంటుంది. దీని ద్వారా అదనపు కూలీ కూడా పొందవచ్చు. తాజాగా కూలీ పెంచిన కేంద్రం ఎంత మేరకు పెంచింది చెప్పలేదని అధికారులు చెబుతున్నారు. ఎన్నికల నియమావళి అమలులో ఉన్న కారణంగా వివరాలు వెల్లడించలేదని తెలిపారు. ఉత్తర్వులు వచ్చిన తర్వాత కూలీలకు అదనపు కూలి చెల్లించనున్నట్లు పేర్కొన్నారు. ఇదిలా ఉంటే పనుల ప్రదేశంలో వసతులు కల్పించాలని కూలీలు మొర పెట్టుకుంటున్నారు. టెంట్లు, ప్రథమ చికిత్స కిట్లు, ఓఆర్ఎస్ ప్యాకెట్లు అందుబాటులో ఉంచాలని కోరుతున్నారు.

# టెట్ ఫీజు తగ్గించాలని పెరుగుతున్న విజ్ఞప్తులు

మొదటి పేజీ తరువాయి

నిర్వహిస్తుండటంతో ఒక్క పేపర్‌కు రూ.వెయ్యి చొప్పున రెండు పేపర్లకు రూ.రెండువేల ఫీజు చెల్లించాలని విద్యా శాఖ ప్రకటించింది. దీంతో అభ్యర్థులు తీవ్ర ఆందోళన చెందుతున్నారు. ఇప్పటికే డీఎస్సీ పరీక్షకు రూ.వెయ్యి చెల్లిస్తున్నామని, మళ్లీ టెట్‌కు అంతే ఫీజు పెట్టడం సరికాదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రాష్ట్రవ్యాప్తంగా పలు లైబ్రరీల వద్ద నిరసనలు కూడా తెలిపారు. దీంతో టెట్ ఫీజులపై ప్రభుత్వపెద్దలు, విద్యా శాఖ అధికారులను ఆరా తీశారు. కానీ, ఆన్‌లైన్ పరీక్షల నేపథ్యంలోనే ఫీజు పెంచాల్సి వచ్చిందని వారు పేర్కొన్నట్టు తెలిసింది. గురుకుల విద్యా సంస్థల రిక్రూట్‌మెంట్ బోర్డు ఒక్కో అభ్యర్థి నుంచి రూ.1,200 ఫీజు వసూలు చేశారని తెలిపినట్టు సమాచారం. కాగా, ఆన్‌లైన్ పరీక్షలు కావడంతోనే దరఖాస్తు ఫీజు పెంచామని విద్యా శాఖ ఉన్నతాధికారి ఒకరు చెప్పారు. ట్రిబ్ కంటే రూ.200 తక్కువగానే తీసుకుంటున్నామని తెలిపారు. ఇప్పటికైతే ఫీజు తగ్గించాలనే ఆలోచన లేదని ఆయన వెల్లడించారు. టెట్ ఫీజు తగ్గించిన తర్వాతే దరఖాస్తులు తీసుకోవాలని రాష్ట్ర ప్రభుత్వానికి బీఈడీ, డీఈడీ అభ్యర్థుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు రాంమోహన్ రెడ్డి విజ్ఞప్తి చేశారు.

**అభ్యర్థులు సంప్రదించాల్సిన నంబర్లు**

టెట్ ఆఫీస్: 70757 01763/64
హెల్ప్ డెస్క్ నంబర్లు: 70757 01768/84
హెల్ప్ డెస్క్- టెక్నికల్ రిలెటెడ్: 70329 01383

# వ్యాపారులే ఎంపీలు, ఎమ్మెల్యేలవుతున్నారు

### ఈ విధానాన్ని ఖండించిన పార్టీ నేత తమ్మినేని వీరభద్రం

### రైతులను ఆదుకోవాలి.. కూలీల వలసలను ఆపాలని విజ్ఞప్తి



తెలంగాణ బ్యూరో, మార్చి 26 (తీన్మార్ న్యూస్): వ్యాపారులు ఎంపీలు, ఎమ్మెల్యేలవుతున్నారని దీన్ని సీపీఎం ఖండిస్తుందని ఆ పార్టీ నేత తమ్మినేని వీరభద్రం అన్నారు. భువనగిరి పట్టణంలో సీపీఎం నేత తమ్మినేని వీరభద్రం మీడియా సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీజేపీ గతంలో చేసిన వాగ్ధాలను అమలు చేయడం లేదన్నారు. మహిళలపై అత్యాచారాలు జరుగుతున్నాయని ఆరోపించారు. బీజేపీ 8వేలకోట్లు, కాంగ్రెస్‌కు 2వేల కోట్లు విరాళాలు వచ్చాయన్నారు. ఎలక్టోరల్ బాండ్లను సీపీఎం వ్యతిరేకించిందన్నారు. కోర్టు కేసుల్లో ఇంప్లీడ్ అయ్యామన్నారు. పార్టీ మార్పు అనేది సాధారణమైందని అధికారంలో నుంచి పార్టీ ప్రతిపక్షంలోకి వెళ్తే నాయకులు పార్టీలను వీడుతున్నారన్నారు. అధికారం లేకపోతే పార్టీ ఖాళీ అవుతుందన్నారు. భువనగిరి సీపీఎం అభ్యర్థి జహంగీర్‌ను గెలిపించాలని కోరారు. తనను అభ్యర్థిగా ఎంపిక చేసిన నేతలకు జహంగీర్ ధన్యవాదాలు తెలిపారు. సుదీర్ఘంగా రాజకీయాల్లో ఉన్నానని చేసిన పోరాటాలు వృథా కాలేదన్నారు. ఆర్థికంగా కొంత పార్టీ వెనుకబడిందని ప్రజలు అందరు కలిసి విరాళాలు వేసుకొని సర్పంచ్‌గా గెలిపించారన్నారు. ప్రశ్నించే వారిని గెలిపించాలని సీపీఎం పార్టీ విజ్ఞప్తి చేస్తుందన్నారు. జూలకంటి రంగారావు ధన బలానికి, నిజాయితీగా పని చేస్తున్న ఎన్నికలుగా భువనగిరి ఎంపీ ఎన్నికలుగా చూడాలన్నారు. పార్టీల ఫిరాయించే వారికి బుద్ధి చెప్పాలన్నారు. చెరువుల్లో నీటి చుక్క లేదని సాగు, తాగు నీటికి ప్రస్తుతం ఇబ్బందిగా ఉందన్నారు. రైతుబంధు రాలేదని రైతులను ఆదుకోవాలన్నారు. కూలీల వలసలను ఆపాలని విజ్ఞప్తి చేశారు.

# హోం గ్రౌండ్ లో ఐపీఎల్ మ్యాచ్ ఆడనున్న సన్ రైజర్స్

మొదటి పేజీ తరువాయి

హైదరాబాద్, ముంబై ఇండియన్స్ జట్ల మధ్య మ్యాచ్ జరగనుంది. ఈ నేపథ్యంలో పోలీసులు కీలక ప్రకటన చేశారు. స్టేడియంలోకి ల్యాప్టాప్, వాటర్ బాటిల్స్, బ్యానర్స్, లైటర్స్, సిగరెట్స్, బైనాక్యులర్స్ తీసుకెళ్లొద్దని పోలీసులు తెలిపారు. మ్యాచ్ ప్రారంభమయ్యే 3 గంటల ముందు నుంచి ప్రేక్షకులను అనుమతిస్తామని ఎవరైనా బ్లాక్ టికెట్స్ అమ్మితే కఠిన చర్యలు తప్పవని వార్నింగ్ ఇచ్చారు. 2500 మందితో బందోబస్తు ఏర్పాటు చేశామని రాచకొండ సీపీ తరుణ్ జోషి వెల్లడించారు.

తీన్మార్
తెలుగు దినపత్రిక

# అప్రమత్తతే శ్రీరామరక్ష!

అమెరికాలో భారతీయులు, భారతీయ మూలాలున్నవారి అనుమానాస్పద మరణాలు కలవరం కలిగిస్తున్నాయి. ఇలా మృత్యువాత పడుతున్న వారిలో అక్కడి యూనివర్శిటీల్లో సీటు సంపాదించుకుని, భవిష్యత్తుపై కొండంత ఆశతో పరాయి దేశం చేరిన విద్యార్థులే ఎక్కువ మంది కావడం గమనార్హం. ఈ ఏడాది ఆరంభం నుంచే మొదలైన ఈ అనుమానాస్పద మరణాల పరంపర మూడున్నర నెలలుగా కొనసాగుతూనే ఉంది. జనవరి 16న వివేక్ సైనీ అనే పాతికేళ్ల వయసున్న విద్యార్థి మాదకద్రవ్యాలకు బానిసైన ఒక వ్యక్తి చేతిలో దారుణ హత్యకు గురయ్యాడు. అది మొదలు నీల్ ఆచార్య, సమీర్ కామత్, శ్రేయాస్ రెడ్డి బెనిగెరి, అకుల్ ధవన్, వివేక్ తనేజా తదితరులు దేశం కాని దేశంలో అనూహ్యమైన పరిస్థితుల్లో కన్నుమూశారు.

వాషింగ్టన్ యూనివర్శిటీలో చదువుకుంటున్న అమర్ నాథ్ ఘోష్‌ను ఫిబ్రవరి 27న దుండగులు సెయింట్ లూయిాలో దారుణంగా కాల్చి చంపారు. పశ్చిమ బెంగాల్‌కు చెందిన అమర్ నాథ్ పేరున్న శాస్త్రీయ నృత్య కళాకారుడు కూడా. బోస్టన్ యూనివర్శిటీ విద్యార్థి అయిన తెలుగు కుర్రాడు అభిజిత్ పరుచూరు (20) మృతదేహం అడవిలో ఒక కారులో లభ్యమైంది. ఈ దుస్సంఘటనలు.. ప్రపంచంలోనే అతి పెద్ద ప్రజాస్వామిక దేశాలైన అమెరికా, భారతదేశాల మధ్య మైత్రీ బంధాన్ని సహజంగానే ప్రశ్నార్థకంలో పడవేస్తున్నాయనడంలో సందేహం లేదు. భారతీయ విద్యార్థులనే లక్ష్యంగా చేసుకుని సాగుతున్న ఈ మారణ కాండ అగ్రరాజ్యం అధ్యక్షుడి దృష్టికి రాకపోలేదు. 'ఒక దేశాన్ని లేదా వర్ణాన్ని లేదా మతాన్ని లక్ష్యంగా చేసుకుని హింసకు పాల్పడటాన్ని అమెరికా సహించదు.

వీటిని ఉక్కుపాదంతో అణచివేస్తాం' అంటూ వైట్ హౌస్‌లో భద్రతా మండలి వ్యూహాత్మక కమ్యూనికేషన్ల సమన్వయకర్త జాన్ కిర్బీ ఖండించినా, హత్యాకాండ మాత్రం ఆగలేదనడానికి అమర్ నాథ్ ఘోష్ విషాదాంతమే నిదర్శనం. అమెరికాలో సగటున రోజుకో భారతీయుడి మరణవార్త వినాల్సి వస్తోందని లాభాపేక్ష రహిత స్వచ్ఛంద సంస్థ 'టీమ్ ఎయిడ్' వ్యవస్థాపకుడు మోహన్ నన్నపనేని చేసిన వ్యాఖ్యలు పరిస్థితి తీవ్రతకు అద్దం పట్టేవే. గత రెండు దశాబ్దాలుగా అమెరికా, కెనడా, ఆస్ట్రేలియా, బ్రిటన్ వంటి దేశాలకు వలస వెళ్లే భారతీయుల సంఖ్య బాగా పెరిగింది. విద్య, ఉద్యోగావకాశాలను వెతుక్కుంటూ ఇలా వెళ్లినవారిలో చాలా మంది అక్కడే స్థిరపడుతున్నారు. భారత దేశం నుంచి ఏటా 25 లక్షల మంది విదేశాలకు వలస వెళ్తున్నట్లు అంచనా. సహజంగా చదువులో ముందుండే భారతీయ విద్యార్థులు అక్కడి వాతావరణ పరిస్థితులకు, సంస్కృతీ సంప్రదాయాలకు కొన్ని రోజుల వ్యవధిలోనే అలవాటు పడుతున్నారు. కానీ కొందరు మాత్రం విదేశాలలో సర్దుకుపోలేక, స్వదేశానికి తిరిగి వెళ్లలేక బలహీనమైన క్షణంలో ఆత్మహత్యల వంటి తీవ్రమైన నిర్ణయాలు తీసుకుంటున్నారు. భారతీయ విద్యార్థుల అనుమానాస్పద మరణాలపై అక్కడి పోలీసుల స్పందన అరకొరగా ఉందన్న ఆరోపణలూ ఉన్నాయి. ఇండియానా రాష్ట్రంలోని పర్డ్యూ యూనివర్శిటీలో రెండేళ్ల వ్యవధిలో ముగ్గురు భారతీయ విద్యార్థులు అనుమానాస్పద పరిస్థితుల్లో మరణించారు.

వీరిలో వరుణ్ మనీష్ అనే విద్యార్థిని కొరియాకు చెందిన సహ విద్యార్థే హత్య చేయగా, మిగతా రెండు సంఘటనల్లోనూ పోలీసుల వైఖరి నిర్లక్ష్యపూరితమనే విమర్శలు వినవచ్చాయి. అమెరికాకు వెళ్లే విద్యార్థులలో భారతీయులు, చైనీయులు ఎక్కువ. తమ దేశానికి వచ్చి తమ ఉపాధి అవకాశాలు కొల్లగొడుతున్నారనే దుగ్ధ అక్కడి విద్యార్థులలో లేకపోలేదు. తుపాకీ సంస్కృతి పెచ్చుమీరిన అమెరికాలోని యూనివర్శిటీల్లో భద్రత కూడా అంతంత మాత్రమే. భారత విదేశీ వ్యవహారాల మంత్రిత్వ శాఖ నివేదిక ప్రకారం 2018- 2023 మధ్య కాలంలో విదేశాల్లో 403 మంది భారతీయ విద్యార్థులు మరణించారు. ఈ నేపథ్యంలో ప్రముఖ పారిశ్రామికవేత్త ఇంద్రానూయిా చెప్పిన హితోక్తులను చెవికెక్కించుకోవడం యువతరానికి అత్యంత ఆవశ్యకం. తమ వీసా స్టేటస్ గురించి, విదేశీ విద్యార్థిగా తమకున్న పరిమితులగురించి గుర్తెరిగి మసలుకోవాలంటూ ఆమె చేసిన సూచనలు శిరోధార్యం.

సోషల్ మీడియా పట్ల అప్రమత్తంగా ఉండాలంటూ, రాత్రివేళల్లో ఒంటరిగా చీకటి ప్రదేశాల్లో తిరగడం, అతిగా మద్యం సేవించడం వంటివి తగదని హితవు చెప్పారామె. ఉపాధి అవకాశాలకు స్వర్గధామంగా అమెరికాను అభివర్ణించడం కద్దు. అయితే నాణేనికి ఒక వైపున్న బొమ్మను మాత్రమే చూస్తున్న యువత దాని వెనుకనే ఉన్న బొరుసును మాత్రం ఉపేక్షిస్తోంది. అమెరికాలో తుపాకీ సంస్కృతి, మితిమీరిన మాదకద్రవ్యాల వాడకం, వర్ణ వివక్ష, విదేశీయులపై విద్వేషభావం కూడా ఎక్కువేనన్న సంగతిని విద్యార్థులు, వారి తల్లిదండ్రులు గ్రహించి తదనుగుణంగా మసలుకుంటేనే అందరికీ శ్రీరామరక్ష!

# శ్రీ యాదగిరి లక్ష్మీనరసింహ ఆలయానికి పూర్వ వైభవం తెస్తాం

- ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య
- ప్రజా పాలనకు వంద రోజులు
- ప్రజా నాయకుడికి 100 ప్రశ్నలు



భువనగిరి జిల్లా ప్రతినిధి, మార్చి 26(తీన్మార్ న్యూస్): తెలంగాణలోని రెండో తిరుపతిగా పేరుగాంచిన యాదగిరి లక్ష్మీనరసింహస్వామి దేవస్థానానికి పూర్వ వైభవాన్ని తీసుకొస్తామని ఆలేరు ఎమ్మెల్యే ప్రభుత్వ విప్పు బీర్ల ఐలయ్య అన్నారు. ప్రజా పాలనకు 100 రోజులు ప్రజానాయకుడికి 100 ప్రశ్నలు అనే కార్యక్రమాన్ని ఆలేరు నియోజకవర్గ స్థాయిలో మంగళవారం భువనగిరి న్యూ దీప్తి హొటల్లో విలేకరులతో ప్రత్యేక సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా నియోజకవర్గస్థాయిలోని విలేకరులు ఆయా మండలాలలో ప్రజా సమస్యలపై సందించిన 117 ప్రశ్నల వర్షం కురిపించారు. వీటికి బీర్ల ఐలయ్య ఉత్సాహంగా సమాధానాలు ఇచ్చారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన నాటి నుండి నియోజకవర్గానికి 100 కోట్లతో పలు రకాల అభివృద్ధి పనులు చేశామన్నారు. ప్రధానంగా రోడ్ల మరమ్మత్తులు కల్వర్తులు త్రాగునీరు అధిక ప్రాధాన్యం ఇచ్చామన్నారు. తాను ప్రజా నాయకుడిని కాదని ప్రజాసేవకుడినని ఎల్లప్పుడూ ప్రజలకు అందుబాటులోనే ఉంటానని తెలిపారు. సమావేశంలో విలేకరులు తన దృష్టికి తీసుకువచ్చిన అంశాలన్నిటిని సాధ్యమైనంత వరకు ఒక్కొక్కటి పరిష్కారం కోసం సత్వరమే కృషి చేస్తానని తెలిపారు. కాంగ్రెస్ పార్టీ తరపున ప్రజలకు సేవ చేసే




నాయకులకు ఎల్లప్పుడు తలుపులు తెరిచే ఉంటాయని పార్టీ కోసం పని చేసిన వారికి ఎప్పటికీ గుర్తింపు ఉంటుందని తెలిపారు. కొత్త,పాత అని తేడా లేకుండా అందరిని కాంగ్రెస్ పార్టీ కలుపుకుపోతుందని, పార్టీ కోసం పనిచేసిన వారికి పార్టీలో తగిన గుర్తింపు లభిస్తుందని అన్నారు. ఆలేరులో ఇకనుంచి వివిధ పార్టీల నుండి ఊహించని విధంగా కాంగ్రెస్ పార్టీలో చేరికలు ఉంటాయని తెలిపారు. ఆలేరు ప్రజలు తనపై నమ్మకం ఉంచి ఎన్నికలలో తనకు రూ. 1,25,000/- ఓట్లు వేసి అత్యధిక మెజారిటీతో గెలిపించినందుకు తాను ఆలేరు ప్రజలకు రుణపడి ఉంటారని అన్నారు. ఆలేరులో తనకు ప్రతి పక్షమే లేదని అన్నారు. ఎన్నికల ఉన్నంతవరకే పార్టీలని ఎన్నికల అనంతరం ఆలేరు నియోజకవర్గ ప్రజలందరికీ ఏ పార్టీ అని తేడా లేకుండా తగు న్యాయం చేస్తానని అన్నారు గత ప్రభుత్వ పాలకులు చేసిన పాపాలన్నింటికీ ఆ యాదాద్రి లక్ష్మీ నరసింహ స్వామి ఏ చూసుకుంటాడని అన్నారు. అనంతరం విలేకరులు అడిగిన ప్రశ్నలకు ఒక్కటిగా కాంగ్రెస్ పార్టీ వంద రోజులలో చేసిన అభివృద్ధి గురించి సమాధానం ఇచ్చారు. ఆలేరు నియోజకవర్గంలో జాతీయ గ్రామీణ ఉపాధి పథకం కింద 11 కోట్ల 39 లక్షల రూపాయలు నిధులు మంజూరు చేయించి సిసి రోడ్ల నిర్మాణ పనులు పూర్తి చేశామన్నారు. 15 కోట్లతో కొలనుపాక వయా జైన్ టెంపుల్ నుండి బచ్చన్నపేట డబుల్ లైన్ రోడ్డు పనులు ప్రారంభించామన్నారు. ఆలేరు పట్టణంలోని 3.5 కోట్లతో కొలనుపాక రైల్వే అండర్ బ్రిడ్జి పనులు పై ప్రత్యేక చొరవ తీసుకొని వేగవంతం చేయడం జరిగిందన్నారు. డిఎంఎఫ్ 2 ద్వారా రెండు కోట్ల 36 లక్షల రూపాయలతో నియోజకవర్గంలోని పలు గ్రామాలకు అంగన్వాడీ కేంద్రాలు, అండర్ గ్రౌండ్ డ్రైనేజీ మరియు సిసి రోడ్లను మంజూరు చేసి నిర్మాణాలు ప్రారంభించామన్నారు. ఎస్డిఎఫ్ నిధుల కింద కోటి 80 లక్షల రూపాయలతో నియోజకవర్గంలోని గ్రామాలకి మంచినీటి సరఫరా లో ఇబ్బందులు లేకుండా కొత్త బోర్లు మరియు మోటర్లు, మంచినీటి పైప్లైన్లు మంజూరు చేయించానన్నారు. ఎస్డిఎఫ్ నిధుల ద్వారా 10 లక్షల రూపాయలతో రాజాపేట మండలం రఘునాథపురం, బసంతపూర్ గ్రామాలలో ఇండ్ల పై నుండి వెళ్తూ గ్రామ ప్రజలకు తీవ్ర ఇబ్బంది కలిగిస్తున్న కరెంట్ లైన్లను మార్పించడానికి నిధులను మంజూరు చేయించానన్నారు.

బొమ్మలరామారం మండల ప్రజల చిరకాల కోరిక మరియు ఎన్నో సంవత్సరాల నుండి పెండింగ్లో ఉన్న జగదేవపూర్ పిడబ్ల్యు రోడ్డు టు చీకటిమామిడి వయా వడపర్తి ఆర్ అండ్ బి డబుల్ లైన్ రోడ్డును 18 కోట్లతో మంజూరు చేసి పనులు ప్రారంభించడం జరిగిందన్నారు. తుర్కపల్లి మండలంలో ఎస్టీ ఎస్డీఎఫ్ నిధుల కింద 3 కోట్లతో జంగారెడ్డి కుంట తండా నుండి గుజ్జవానికుంట తండా మరియు పొట్టి మరి తండా నుండి నాగాయపల్లి వరకు బీటీ రోడ్డు పనులు మంజూరు చేయించి శంకుస్థాపన పూర్తి అయ్యిందన్నారు. మెడికల్ కాలేజ్ ఏర్పాటు చేయడానికి స్థల సేకరణ పనులు వేగవంతం చేయవలసిందిగా అధికారులను ఆదేశించడం జరిగింది అని, అదేవిధంగా తాత్కాలికంగా భువనగిరి పాత కలెక్టరేట్లో మెడికల్ కాలేజి నిర్వహించడానికి ఏర్పాట్లు చేయడం జరిగిందని, ఆలేరు నియోజకవర్గంలో 10 కోట్ల నిధులతో చెక్ డ్యాములు కట్టడానికి నిధులు మంజూరు చేయించి పనులు ప్రారంభించడానికి ఏర్పాట్లు పూర్తయ్యాయని అన్నారు.

బొమ్మలరామారం మండలంలో పలు అభివృద్ధి కార్యక్రమాలకు హెచ్ఎండిఏ నిధులు 20 కోట్లకు ప్రతిపాదనలు పంపగా, వాటికి ఆమోదం లభించింది త్వరలో ఆ పనులు ప్రారంభం కాబోతున్నాయని, బొమ్మలరామారం మండల ప్రజల చిరకాల కోరిక మరియు ఎన్నో సంవత్సరాల నుండి పెండింగ్లో ఉన్న జగదేవపూర్ పిడబ్ల్యు రోడ్డు టు చీకటిమామిడి వయా వడపర్తి ఆర్ అండ్ బి డబుల్ లైన్ రోడ్డును 18 కోట్లతో మంజూరు చేసి పనులు ప్రారంభించడం జరిగిందని, తుర్కపల్లి మండలంలో ఎస్టీ ఎస్డీఎఫ్ నిధుల కింద 3 కోట్లతో జంగారెడ్డి కుంట తండా నుండి గుజ్జవానికుంట తండా మరియు పొట్టి మరి తండా నుండి నాగాయపల్లి వరకు బీటీ రోడ్డు పనులు మంజూరు చేయించి శంకుస్థాపన చేయడం జరిగిందని, మెడికల్ కాలేజ్ ఏర్పాటు చేయడానికి స్థల సేకరణ పనులు వేగవంతం చేయవలసిందిగా అధికారులను ఆదేశించడం జరిగిందని, అదేవిధంగా తాత్కాలికంగా భువనగిరి పాత కలెక్టరేట్లో మెడికల్ కాలేజి నిర్వహించడానికి ఏర్పాట్లు చేయడం జరిగిందన్నారు. ఆలేరు నియోజకవర్గంలో 10 కోట్ల నిధులతో చెక్ డాములు కట్టడానికి నిధులు మంజూరు చేయించి పనులు ప్రారంభించడానికి ఏర్పాటు చేయడం జరిగాయని, బొమ్మలరామారం మండలంలో పలు అభివృద్ధి కార్యక్రమాలకు హెచ్ఎండిఏ నిధులు 20 కోట్లకు ప్రతిపాదనలు పంపగా, వాటికి ఆమోదం లభించింది త్వరలో ఆ పనులు ప్రారంభం కాబోతున్నాయని అన్నారు. యాదగిరిగుట్టలో రోడ్డు విస్తరణలో షాపులు కోల్పోయిన బాధితులకు 185 మందికి కొండ కింద షాపులు కట్టి వాటికి పట్టా సర్టిఫికెట్లు ప్రదానం చేసి ప్రారంభించడం జరిగిందని అన్నారు. ఆలేరు నియోజకవర్గ పరిధిలో 50 కోట్లతో పంచాయతీరాజ్ రోడ్లకు ప్రపోజల్స్ తయారు చేసి పంపడం జరిగిందని, అదేవిధంగా 120 కోట్లతో అర్ అండ్ బి శాఖకు చెందిన రోడ్లు ప్రపోసల్స్ పంపించడం జరిగిందని, ఎస్టిఎస్డిఎఫ్ నిధుల కింద తుర్కపల్లి మండలంలో ధర్మారం టు బిలియా తండా వయా కాశర్ల గడ్డ తండా రోడ్డుని రెండున్నర కోట్లతో ప్రతిపాదనలు పంపించడం జరిగిందన్నారు. ఆలేరు నియోజకవర్గంలో తుర్కపల్లి మండలంలో మంచిరోని మామిల్లు, దయంబడ్డ తండా, ఆత్మకూరు మండలంలోని మోదుగుకుంట గ్రామంలో, రాజాపేట మండలం కురారం పెద్ద చెరువు అలుగు, చెరువు కట్ట పూర్తిస్థాయి మరమ్మత్తుల కోసం హామీ ఇచ్చారు. పుట్టగూడెం తండాలో సెల్ఫోన్ సిగ్నల్స్ లేక ప్రజల ఇబ్బందులను గమనించి ప్రత్యేకంగా సంబంధిత అధికారులతో మాట్లాడి టవర్స్ వేయడానికి అనుమతులు తీసుకురావడం జరిగింది అన్నారు. గత 100 రోజుల ప్రజా పాలనలో ఆలేరు నియోజకవర్గం లోని 112 గ్రామాలు పర్యటించి ప్రజల సమస్యలను ప్రత్యక్షంగా తెలుసుకుని పరిష్కారానికి సంబంధిత అధికారులతో మాట్లాడడం జరిగిందని అని అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు అండెం సంజీవరెడ్డి, జనగామ ఉపేందర్ రెడ్డి, గిరి, భరత్ గౌడ్, సుదర్శన్ రెడ్డి, జిల్లా మహిళా అధ్యక్షురాలు నీల పద్మ, నమిల మహేందర్ గౌడ్, తదితరులు పాల్గొన్నారు.




# రాబోయే పార్లమెంట్ ఎన్నికల దృష్ట్యా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా అప్రమత్తంగా ఉండాలి

- పాత నేరస్తులు, రౌడీ షీటర్ల కదలికలపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేయాలి
- నెలవారీ నేర సమీక్షా సమావేశంలో జిల్లా ఎస్పీ రక్షిత కె మూర్తి





వనపర్తి జిల్లా ప్రతినిధి, మార్చి 26(తీన్మార్ న్యూస్): జిల్లా ఎస్పీ కార్యాలయంలోని కాన్ఫరెన్స్ హాలు నందు జిల్లా పోలీస్ అధికారులతో నెలవారీ నేర సమీక్షా సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈ సమావేశంలో పాల్గొన్న పోలీస్ అధికారులతో ఎస్పీ మాట్లాడుతూ రాబోయే పార్లమెంటు ఎన్నికల దృష్ట్యా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీస్ అధికారులు ఎప్పటికప్పుడు అప్రమత్తంగా ఉంటూ ఎన్నికల సంఘం సూచనల ప్రకారం బాధ్యతగా విధులు నిర్వర్తించాలని తెలియజేసారు. ప్రతి పోలీస్ స్టేషన్ పరిధిలో సమస్యాత్మక వ్యక్తుల, రౌడీషీటర్ల కదలికలను ఎప్పటికప్పుడు పరిశీలిస్తూ ప్రత్యేక నిఘా ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. ప్రజలంతా తమ ఓటు హక్కును వినియోగించుకునేలా వారిలో భరోసా కల్పించే విధంగా పనిచేయాలని తెలిపారు. గంజాయి అక్రమ రవాణా, క్రికెట్ బెట్టింగులు, జూదం, మట్కా అలాంటి అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడే వ్యక్తులపై కఠిన చర్యలు తీసుకోవాలని సూచించారు. ఎన్నికల కోడ్ అమలులో ఉన్నందున అక్రమ మధ్యము, నగదు రవాణాను నిరోధించడంలో భాగంగా చెక్ పోస్ట్ లలో విధులు నిర్వర్తించే సిబ్బందిని ఎప్పటికప్పుడు అప్రమత్తం చేయాలని సూచించారు. సరైన ఆధారాలు లేకుండా ఎవరైనా పరిమితికి మించి నగదును రవాణా చేస్తూ పట్టుబడితే ఎన్నికల నియమావళి ప్రకారం కేసుల నమోదు చేయాలని తెలిపారు. ప్రతి కేసులో 'క్వాలిటీ ఆఫ్ ఇన్వెస్టిగేషన్' ద్వారా నేరస్తులకు శిక్ష పడే విధంగా చేసి బాధితులకు న్యాయం చేకూర్చాలని సూచించారు. కేసుల విచారణలో జాప్యం చేస్తే సహించేది లేదని హెచ్చరించారు. నిర్లక్ష్యంగా వ్యవహరించిన అధికారులపై క్రమశిక్షణా చర్యలు తప్పవని హెచ్చరించారు. పెట్రోలింగ్,బ్లూ కోల్ట్స్ వాహనాలతో అధికారులు, సిబ్బంది ఎల్లప్పుడూ రోడ్లపై తిరుగుతూ ప్రజలకు అందుబాటులో ఉండాలని సూచించారు. ప్రభుత్వ నిషేధిత గంజాయి మరియు ఇతర మత్తు పదార్థాలకు బానిసలై యువత తమ అమూల్యమైన భవిష్యత్తును నాశనం చేసుకుంటున్నారు. జిల్లా వ్యాప్తంగా హాట్ స్పాట్స్ ను గుర్తించి గంజాయిని రవాణా చేసే వ్యక్తులతో పాటు గంజాయిని సేవించే వారిపై కూడా కేసులు నమోదు చేసి కఠినచర్యలు తీసుకోవాలని సూచించారు. జిల్లాలోని ప్రతి పోలీస్ స్టేషన్ పరిధిలోని ముఖ్యమైన ప్రదేశాలలో సీసీ కెమెరాలను ఏర్పాటు చేసుకోవాలని తెలిపారు. దొంగతనం కేసుల్లో ప్రస్తుతం పోలీసు శాఖ వినియోగిస్తున్న సాంకేతికతను ఉపయోగించి నేరస్తులను పట్టుకుని సొత్తును రికవరీ చేసి భాదితులకు త్వరతగతిన అందేలా చూడాలని తెలిపారు. సైబర్ నేరాల బారిన పడకుండా ప్రజలను ఎప్పటికప్పుడు అప్రమత్తం చేస్తూ అవగాహనా కార్యక్రమాలను ఏర్పాటు చేయాలని కోరారు. జిల్లా వ్యాప్తంగా సైబర్ నేరాల్లో నగదును కోల్పోయి, భాధితులు వెంటనే స్పందించి ఫిర్యాదు చేసినప్పుడు సైబర్ నేరగాళ్ళ ఖాతాలలో ఉన్న నగదును పుట్ ఆన్ హొల్డ్ లో ఉంచడమైనదని అన్నారు. అట్టి నగదును కోర్టు ద్వారా కొన్ని మార్గనిర్దేశాలతో భాదితులకు అందజేయడం జరిగితుందని తెలిపారు. ప్రతి పోలీస్ స్టేషన్ పరిధిలో ఎక్కువగా రోడ్డు ప్రమాదాలు జరిగే ప్రదేశాలను గుర్తించి(బ్లాక్ స్పాట్స్), వాటి నివారణకై సంబంధిత అధికారులతో సమన్వయం పాటిస్తూ ప్రమాద నివారణ చర్యలు చేపట్టాలని సూచించారు. పెండింగ్లో ఉన్న కేసుల సత్వర పరిష్కారానికి న్యాయాధికారులతో సమన్వయం పాటిస్తూ బాధితులకు న్యాయం చేకూరేలా పనిచేయాలని తెలిపారు. ట్రాఫిక్ నియమాలను పాటించకుండా మద్యం సేవించి వాహనాలను నడుపుతూ, ర్యాష్ డ్రైవింగ్ చేస్తూ రోడ్డు ప్రమాదాలకు కారణమయ్యే వారిపై చట్టపరంగా కేసులు నమోదు చేసి కఠిన చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ సమావేశంలో అడిషనల్ ఎస్పీ రామదాసు తేజావత్, డిఎస్పీ జె.వేంకటేశ్వరరావు, డిసిఆర్బిఐ డిఎస్పీ కృష కిశోర్, జిల్లాలోని వనపర్తి, కొత్తకోట, ఆత్మకూర్ సిఐలు,జిల్లా ఎస్సైలు మరియు సిబ్బంది పాల్గొన్నారు.



# రాజపేట మండలం బిజెపి జనరల్ సెక్రెటరీగా గుజ్జ రామచంద్రం

**- నియామక పత్రం అందజేస్తున్న మండల అధ్యక్షులు దాచేపల్లి రాజు**

రాజపేట మార్చి 26(తీన్మార్ న్యూస్): రాజాపేట మండలం భారతీయ జనత పార్టీ మండల అధ్యక్షులు దాచేపల్లి రాజు మండల కమిటీ నియమిస్తూ గుజ్జ రామచేంద్రం ని మంగళవారం జనరల్ సెక్రటరీ గా నియమిస్తు నియామకాపత్రం అందజేసారు. ఈ సందర్భంగా గుజ్జ రామచేంద్రం మాట్లాడుతూ పార్టీ తనపై నమ్మకం తో బాధ్యతలు ఇచ్చినందుకు ధన్యవాదములు తెలుపుతు పార్టీ కి పూర్తి స్థాయిలో సేవలందిస్తూ రాబోయే పార్లమెంట్ ఎన్నికల్లో భోనగిరి అభ్యర్థి బూర నర్సయ్య గెలుపే లక్ష్యంగా పనిచేస్తానని చెప్పారు. ఈ కార్యక్రమంలో రాజాపేట టౌన్ ప్రజిడెంట్ ఎర్రగోలు వినోద్, యువ మోర్చా జిల్లా



కార్యదర్శి బూర్గు శేఖర్ రెడ్డి, రఘునాధపురం గ్రామ శాఖ అధ్యక్షులు కటకం నగేష్,రమేష్ నాయక్, బీమనపల్లి రమేష్, తదితరులు పాల్గొన్నారు.

# నంగునూరి శ్రావ్యను సన్మానించిన మండల ఆర్యవైశ్యులు, ప్రజా ప్రతినిధులు

రాజాపేట, మార్చి 26(తీన్మార్ న్యూస్): రాజాపేట మండలానికి చెందిన జిల్లా కెమిస్ట్రాండ్ డ్రగ్గిస్ట్ ఈసీ మెంబర్ నంగురు కృష్ణ స్వప్న దంపతుల కుమార్తె నంగునూరు శ్రావ్యా ఎంబిబిఎస్ ఫైనల్ ఇయర్ లో మొదటి స్థానంలో ఉత్తీర్ణత పొందిన సందర్భంగా రాజాపేట మండల ఆర్యవైశుయ్యలు, ప్రజా ప్రతినిధులు, శ్రావ్యను ఘనంగా సన్మానించి అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో రాజాపేట ప్రస్తుత ఎంపీటీసీ బిజెపి మండల అధ్యక్షుడు దాచేపల్లి రాజు, మండల ఆర్య వైశ్య శాశ్వత గౌరవధ్యక్షులు పులిగిల్ల నరసింహులు, యాదాద్రి భువనగిరి జిల్లా ఆర్యవైశ్య మహాసభ ప్రధాన కార్యదర్శి బెజగం సంతోష్, బెజగం నాగభూషణం, పులిగిల్ల శ్రీను, ఉప్పల శ్రీను, ఉమ్మడి శీను, నాయకులు



బిడిద వీరేశం, కాసోజు సంపత్, రేగు సిద్ధులు, పొన్న సంతోష్, తదితరులు పాల్గొన్నారు.

# బీఎస్పీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గా ప్రియదర్శిని మేడి ఎన్నిక

**- హైదరాబాద్ లో రాష్ట్ర కమిటీ సమావేశం**

**- ప్రకటించిన రాష్ట్ర అధ్యక్షులు మంద ప్రభాకర్**



హైదరాబాద్, మార్చి 26(తీన్మార్ న్యూస్): బహుజన్ సమాజ్ వాదీ పార్టీ తెలంగాణ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గా మేడి ప్రియదర్శిని ఎన్నికైయ్యారు. మంగళవారం నాడు హైదరాబాద్ లో నిర్వహించిన రాష్ట్ర కార్యవర్గ సమావేశంలో రాష్ట్ర అధ్యక్షులు మంద ప్రభాకర్ నియామక ఉత్తర్వులు జారీ చేసి, నియమించారు. నల్లగొండ జిల్లా, చిట్యాల మండలం, వట్టిమర్తి గ్రామానికి చెందిన మేడి ప్రియదర్శిని గత మూడు సంవత్సరాలుగా నకిరేకల్ నియోజకవర్గ ఇంచార్జి గా బాధ్యతలు నిర్వహిస్తూ, నియోజకవర్గ వ్యాప్తంగా బీఎస్పీ పార్టీనీ, ఏనుగు గుర్తును గడపగడపకి తీసుకెళ్ళి, బహుజనుల కోసం ఎన్నో రకాల ఉద్యమాలు చేసి, నియోజకవర్గంలో తనకంటూ ఒక ప్రత్యేక ముద్ర వేసుకున్నారు. పార్టీలో యాక్టివ్ గా ఉంటూ, పార్టీ నాయకత్వంలో పేరు సంపాదించికున్న తరుణంలో పార్టీ నాయకత్వం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గా నియమించారు. అనంతరం మేడి ప్రియదర్శిని మాట్లాడుతూ బహుజన రాజ్యం కోసం కోట్లాడే ఏకైక పార్టీ బీఎస్పీ అని, బహుజనులంతా ఏకతాటమీదకి వచ్చి బహుజన రాజ్యం సాధించుకోవాలి అని అన్నారు. తన నియామకానికి సహకరించిన పార్టీ ఆదినాయకురాలు బెహన్ జి మాయావతి, రాష్ట్ర అధ్యక్షులు మంద ప్రభాకర్ కి, జాతీయ కో- ఆర్డినేటర్ రాంజీ కెప్టెన్ తోపాటు తన నియామకానికి సహకరించిన ప్రతి ఒక్కరికీ ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు.

# ప్రభుత్వం రైతులకు రెండు లక్షల రుణమాఫీ పై స్పష్టమైన ప్రకటన ఇవ్వాలి

**- బ్యాంకర్లు రైతులపై చేస్తున్న ఒత్తిడిని నిలువరించాలి**

**- "మాజీ సర్పంచ్ సుంకరి క్రాంతి కుమార్"**

నేరేడుచర్ల, మార్చి 26(తీన్మార్ న్యూస్): ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికలకు ముందు రెండు లక్షల రుణమాఫీ ఏకకాలంలో చేస్తామని ఇచ్చిన హామీ మేరకు రైతులు గతంలో బ్యాంకుల్లో తీసుకున్న క్రాప్ లోన్లు మాఫీ అవుతాయని ఎదురుచూసిన నేటి వరకు ప్రభుత్వం నుండి స్పష్టమైన ప్రకటన రాకపోవడంతో ఆందోళన ఉన్నారని మాజీ సర్పంచ్ క్రాంతినికేతన్ అధ్యక్షులు సుంకర క్రాంతి కుమార్ అన్నారు. ప్రభుత్వం ఆరు గ్యారెంటీ ల హామీలో కొన్ని నెరవేర్చినప్పటికీ రైతులకు ఇచ్చిన రుణమాఫీ హామీ ఇప్పటివరకు నెరవేర్చకపోవడంతో బ్యాంకు సిబ్బంది రైతులపై ఒత్తిడి తెస్తున్న నేపథ్యంలో కట్టాలా వద్దా అన్న సందిగ్ధల్లో రైతులు ఉన్నారని, బ్యాంకుల్లో రుణాలపై వడ్డీ పై వడ్డీ అధికం భారమవుతుండడం బ్యాంకుల నుండి నోటీసులు రావడం కనీసం వడ్డీ కడదామన్న రెన్యువల్ చేసుకుందామన్న తిరిగి రుణమాఫీ మాకు వర్తిస్తుందో లేదో అన్న ఆందోళనలో రైతులు ఉన్నారు. ఈ నేపథ్యంలో ప్రభుత్వం రుణమాఫీ విషయంలో రైతులకు స్పష్టమైన



సమాచారం అందించాలని, ఎన్నికల పేరుతో కాలయాపన చేస్తుంటే బ్యాంకర్లు మాత్రం ఇంటి చుట్టూ తిరుగుతున్నారని, నోటీసులు పంపిస్తుండడంతో ఆందోళన చెందవలసి వస్తుందని రుణమాఫీ చేసేంతవరకు బ్యాంకర్లు రైతులపై ఒత్తిరి తేకుండా చూడాలని, లేదంటే రుణమాఫీ ఇస్తానన్న హామీని రెన్యువల్ చేసుకున్న వారికి వర్తించేలా చూడాలని ఆయన కోరారు.

# వంశరాజు సంఘం ఆధ్వర్యంలో వినతి పత్రం అందజేత



రామన్నపేట, మార్చి 26(తీన్మార్ న్యూస్): మండలంలోని నూతనంగా వంశరాజ్ సంక్షేమ సంఘం ఏర్పాటు చేసి, భవన నిర్మాణం మరియు స్థలం కోసం నకిరేకల్ శాసనసభ్యుడు వేముల వీరేశంకు వినతి పత్రం అందజేశారు. ఈ యొక్క కార్యక్రమానికి రామన్నపేట కాంగ్రెస్ జిల్లా నాయకులు, పూస బాలకిషన్ లు హాజరైనారు. వంశరాజ్ సంఘం నూతన కమిటీ అధ్యక్షులు శ్యామల సత్తయ్య వంశరాజ్, ఉపాధ్యక్షులు బండారి దుర్గయ్య వంశరాజ్, ప్రధాన కార్యదర్శి ఒంటెద్దు రమేష్ వంశరాజ్, జాయింట్ సెక్రెటరీ చిందం భిక్షం వంశరాజ్, కోశాధికారి శ్యామల నాగరాజ్ వంశరాజ్, వంశ రాజు నాయకులు, ఒంటెద్దు ఆనంద్ వంశరాజ్, శ్యామల గణేష్ వంశరాజ్, చిందం యాదగిరి వంశరాజ్, శ్యామల మహేష్ వంశరాజ్, శ్యామల బుచ్చయ్య వంశరాజ్, ఒంటెద్దు బక్కయ్య వంశరాజ్, మంగయ్య, నరసింహ, మారయ్య, శ్యామల బాలకృష్ణ వంశరాజ్, శ్యామల శ్రీకాంత్ వంశరాజ్, సత్తయ్య వంశరాజ్, బాల మల్లేష్ వంశరాజ్, ఇతర నాయకులు మిరియాల వెంకన్న, తదితరులు పాల్గొన్నారు.



# రాజపేట సమస్యలను ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లిన జర్నలిస్టులు

రాజాపేట, మార్చి 26(తీన్మార్ న్యూస్): రాజపేట మండలంలోని పలు సమస్యలను ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య దృష్టికి జర్నలిస్టులు తీసుకెళ్లి పరిష్కారం చేయాలని కోరారు. మంగళవారం భువనగిరి లోని న్యూ దీప్తి హెూటల్ లో నియోజకవర్గస్థాయి విలేకరులతో ప్రజా పాలనకు 100 రోజులు ప్రజానాయకుడికి 100 ప్రశ్నలు అనే సమావేశంలో రాజపేట మండల సమస్యలపై మండల సీనియర్ జర్నలిస్టు ఉప్పల రమేష్ మాట్లాడారు. రాజపేట మండల కేంద్రంలోని రాజులనాటి గడికోట ను పురవస్తు శాఖ ద్వారా అభివృద్ధి చేసి పర్యాటక కేంద్రంగా మార్చాలని, అన్ని గ్రామాలకు రోడ్లు బస్సు వసతి కల్పించాలని, గొలుసు కట్టు చెరువులు కాలువల ద్వారా నింపేలా చూడాలని, తపస్ పల్లి లేక గంధ మల్ల చెరువులను రిజర్వాయర్లుగా మార్చి రాజపేట మండలానికి సాగునీరు అందించాలని, జూనియర్ ప్రభుత్వ కళాశాల ఏర్పాటు చేయాలని, రియల్ ఎస్టేట్ మాఫియా పై స్పందించాలని, ప్రభుత్వ అటవీ భూములను రక్షించాలని, రఘునాథ పురం గ్రామాన్ని మండలం గా ఏర్పాటు చేయాలని, అదేవిధంగా తీన్మార్ న్యూస్ జిల్లా ఇన్చార్జ్ ఎండి, యూసుఫ్ కుర్రారం కొత్తచెరువు పై ప్రత్యేక శ్రద్ధ వహించి చెరువు కట్ట మరియు అలుగు పూర్తిస్థాయిలో పునరుద్ధరించాలని కోరారు. అక్రిడేషన్ కార్డు సంబంధం లేకుండా జర్నలిస్టులందరికీ ప్లాట్లుఇవ్వాలని, రాజపేట బస్టాండు వినియోగం లోకి తీసుకురావాలని, ప్రభుత్వ పాఠశాలలోని ఉపాధ్యాయులు అన్ని



ప్రభుత్వ కార్యాలయంలోని ఉద్యోగులు సకాలంలో హాజరు అయ్యేలా చూడాలని, సమాచార హక్కు చట్టం ప్రకారంగా అడిగిన వివరాలను నిర్దేశించిన కాలంలో ఇవ్వాలని, కొత్త గ్రామ పంచాయతీలలో రేషన్ షాపులు ఏర్పాటు చేయాలని, బీటీ రోడ్లపై కల్వర్టులురోడ్డు డ్యాములు వెంటనే పూర్తి చేయాలని, తాగునీటి సమస్య తలెత్తకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని, అర్హులందరికీ రేషన్ కార్డులు అందజేయాలని, అర్హులందరికీ 6 గ్యారంటీ పథకాలు అందజేయాలని ఉప్పల రమేష్ ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య దృష్టికి తీసుకెళ్లారు. ఈ సందర్భంగా ఆయన స్పందిస్తూ పూర్తి సమస్యలు ఒకటొకటిగా పరిష్కరించి పూర్తి చేయనున్నట్లు బీర్ల ఐలయ్య హామీ ఇచ్చారు.

# పరమేశ్వర స్వామి చెరువు ఆయకట్టు రైతుల ఆవేదన





ఆత్మకూరు, మార్చి 26(తీన్మార్ న్యూస్): మునిసిపల్ కేంద్రంలోని శ్రీశ్రీశ్రీ చర్ల పరమేశ్వర స్వామి చెరువు ఆయకట్టు పరిధిలో రైతులు గత 20 ఏళ్ల పంటలు పండించుకుంటున్నారు. ఈ నేపథ్యంలో భూగర్భ జలాలు అడుగంటిపోతున్న తరుణంలో పరమేశ్వర స్వామి చెరువులో జలాలు అడుగంటి పోతున్నాయి తామ పండించిన పంట చేతికి రాదేమో అని ఆవేదనతో స్థానిక పెబ్బేర్ ఇరిగేషన్ శాఖ అధికారులతో పర్మిషన్ తీసుకొని చెరువు కట్ట నుంచి పంట పొలాలకు మోటార్ల ద్వారా నీటిని తరలింపు చేశారు. ఈ నేపథ్యంలో రాజకీయ నాయకుల కుట్ర ద్వారా తాము ఏర్పాటు చేసుకున్న మోటార్కు విద్యుత్ కనెక్షన్ ను మంగళవారం రోజు స్థానిక విద్యుత్ శాఖ అధికారి తొలగించారు. ఈ సందర్భంగా రైతులు మీడియాతో మాట్లాడుతూ తాము గత20 సంవత్సరాలుగా చెరువు ఆయకట్టు కింద పంట పొలాల పండిస్తున్నాం చెరువు నీరు అందక చేతికి వచ్చిన పంట పొలాలు ఎండిపోతున్నాయి. కాబట్టి స్థానిక అధికారులతో చర్చించి అన్ని అనుమతులతో పరమేశ్వర స్వామి చెరువులో మోటర్లను ఏర్పాటు చేసుకొని పంట పొలాలకు నీటిని తరలింపు చేస్తున్నామన్నారు.

రాజకీయ కుట్ర ద్వారా నేడు విద్యుత్ కనెక్షన్ తొలగించడం సరైన పద్ధతి కాదని తామ పండించిన పంట చేతికి వచ్చే సమయంలో ఈ విధంగా చేయడం సరైన పద్ధతి కాదని డిమాండ్ చేశారు. తక్షణమే తమ యొక్క పంట పొలాలకు వేసుకున్న మోటార్ కనెక్షన్లను విద్యుత్ శాఖ అధికారులతో మాట్లాడి తిరిగి ఇప్పించాలని రైతులు డిమాండ్ చేశారు.

# నిజాయితీని చాటుకున్న యువకుడు

రామన్నపేట, మార్చి 26(తీన్మార్ న్యూస్): మండలంలోని వెల్లంకి గ్రామానికి చెందిన ఆవనగంటి మహేష్ తన నిజాయితీని చాటుకున్నాడు. రామన్నపేట కెనరా బ్యాంకు పరిధిలోని ఏటీఎంలో మంగళవారం ఉదయం డబ్బులు విత్ డ్రా కోసం వెళ్లగా అక్కడే అంతకుముందే డ్రా చేసిన వ్యక్తి రూ.9000/- రూపాయలు మరిచిపోయి ఉండడం గమనించి ఆ డబ్బులను రామన్నపేట పోలీస్ స్టేషన్లో ఎస్సై పి.మల్లయ్య కి అప్పగించారు. తర్వాత డబ్బులు మర్చిపోయిన నీర్నేముల గ్రామానికి చెందిన కట్ట కుమార్ బ్యాంకును సంప్రదించి వివరాలు సిసి టివిలో చూడగా తన తర్వాత డబ్బులు విత్ డ్రా చేసిన వ్యక్తి వివరాలు తెలుసుకొని అతనితో మాట్లాడగా రామన్నపేట పోలీస్ స్టేషన్లో డబ్బులు అప్ప చెప్పానని చెప్పడంతో స్థానిక ఎస్సై మల్లయ్యను కలవగా డబ్బులు పోలీస్ స్టేషన్లో అప్పజెప్పిన మహేష్ తో డబ్బులను మర్చిపోయిన వ్యక్తికి అప్పగించారు.



నిజాయితీని చాటుకున్న మహేష్ ను రామన్నపేట ఎస్సై మల్లయ్య, వైస్ ఎంపీపీ నాగటి ఉపేందర్, పులిబిక్షం, అప్పం సురేందర్, పోలీస్ అధికారులు అభినందించారు.

# జయంత్ ని పరామర్శించిన ఎంపీ బడుగుల లింగయ్య యాదవ్

గరిడేపల్లి, మార్చి 26(తీన్మార్ న్యూస్): గరిడేపల్లి మండలం, పొనుగోడు గ్రామం ఇటీవల పదోవ తరగతి పరీక్ష రాసి వస్తూ రోడ్డు ప్రమాదానికి గురైన పోనుగోడు ఎంపీటీసీ - 1 రామ్ మల్లమ్మ మనవడు రామ్ జయంత్ ను రాజ్యసభ సభ్యులు భారాస జిల్లా అధ్యక్షులు బడుగుల లింగయ్య యాదవ్ పరామర్శించి వారి కుటుంభానికి మనోధైర్యాన్ని నింపారు. జయంత్ యొక్క ఆరోగ్య క్షేమాలను అడిగి తెలుసుకున్నారు. ఆయన వెంట ఎంపీటీసీ - 1 రామ్ మల్లమ్మ, కార్మిక విభాగం జిల్లా కార్యదర్శి రణపంగా సైదులు, గరిడేపల్లి భారాస మండల అధికార ప్రతినిధి రామ్ సైదులు, మధు, శివ, తదితరులు పాల్గొన్నారు.



# రైతులకు నష్టపరిహారం చెల్లించాలి

**- ఎండిపోయిన పంట పొలాలను పరిశీలించిన**

**- ఎంపీ బడుగు ల లింగయ్య యాదవ్**

నేరేడుచర్ల, మార్చి 26(తీన్మార్ న్యూస్): నేరేడుచర్ల మండలం లో ఎంపీ బడుగుల లింగయ్య యాదవ్ పంట పొలాలను రైతులు ఎండిపోయిన నీటి ఎద్దడి ద్వారా సాగర్ వాటర్ లేకపోవడం రైతులకి సరైన సమయంలో నీరు అందక రైతులు పంట పొలాలను పరిశీలించి రైతుల బాధలు కష్టాలను తెలుసుకొని ఎండిపోయి తీవ్ర నష్టం జరిగిందని, రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే రైతులకు నష్టపరిహారం చెల్లించాలని, రాష్ట్ర ప్రభుత్వం రైతులకు రుణమాఫీ తక్షణమే చేయాలి రైతుబంధు రైతుల ఖాతాలు వెయ్యాలి నీ



మాట్లాడారు. ఈ కార్యక్రమానికి టిఆర్ఎస్ నియోజకవర్గ మండల నాయకులు, కార్యకర్తలు, రైతులు, తదితరులు పాల్గొన్నారు.

# రేణికుంట, పారుపల్లి కురుమ సంఘం కమిటీల నియామకం





రాజాపేట, మార్చి 26(తీన్మార్ న్యూస్): రాజాపేట మండల కురుమ హడ్ హక్ కమిటీ ఆధ్వర్యంలో మంగళవారం రేణికుంట గ్రామ కమిటీల ఏర్పాటు చేసారు. అధ్యక్షునిగా దయ్యాల శ్రినివాస్, ఉపాధ్యక్షులుగా బుడిగే శ్రీశైలంలను ఎన్నుకున్నారు. హడ్ హక్ కమిటీ కన్వీనర్ వస్పరి సుధాకర్ ఆధ్వర్యంలో నూతన నియామక కమిటీలు ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో రేణికుంట కురుమ కుల పెద్దలు పోసుకొండ రాములు, కోరె వీరయ్య, దయ్యాల శ్రీను, బుడగ శ్రీశైలం, తదితరులు పాల్గొన్నారు. అదేవిధంగా పారుపల్లి కురుమ కులస్తులందరికీ ధన్యవాదములు తెలిపారు. నూతన సంఘం అధ్యక్షునిగా జూకంటి రాములు, ఉపాధ్యక్షులుగా మోటే బలమల్లేశంలను ఎన్నుకున్నారు. కమిటీ వేయడానికి సహకరించిన పెద్దలకు హడ్ హక్ కమిటీ తరఫున కన్వీనర్ వసుపరి సుధాకర్ కో కన్వీనర్ గౌరభక్కులు, బాల్ ద శ్రీకాంత్, రేగు సిద్ధులు,మాయకుటి రాజు, రేగు శ్రీశైలంలకు ధన్యవాదములు తెలిపారు.

# ఎన్నికల నేపథ్యంలో వైన్ షాపులు సీజ్



ఆత్మకూర్, మార్చి 26(తీన్మార్ న్యూస్): మహబూబ్నగర్ స్థానిక ఎమ్మెల్సీ ఎన్నికల సందర్భంగా 48 గంటల ముందే వనపర్తి జిల్లా ఆత్మకూరు మండల కేంద్రంలో మంగళవారం రోజు స్థానిక ఎక్సైజ్ పోలీస్ శాఖ సీఐ రమేష్ రెడ్డి ఎస్ఐ సి కృష్ణ కాంత్ ఆధ్వర్యంలో స్థానిక వైన్ షాపులను సీజ్ చేశారు. ఎన్నికల నిబంధనలను ప్రతి ఒక్కరు పాటించాలని సూచించారు.

# ఏసీబీ వలలో ఎంపీడీవో, సీనియర్ అసిస్టెంట్

**- తోటి ఉద్యోగి వద్దే లంచం డిమాండ్**

**- రూ.8వేలు లంచం తీసుకుంటూ పట్టుబడ్డ సీనియర్ అసిస్టెంట్ హరిబాబు**

**- బదిలీపై వెళ్లిన లంచం డిమాండ్**

**- ఏసీబీ అదుపులో బిక్కనూరు ఎంపీడీవో సంతోష్ రెడ్డి**

కమ్మర్ పల్లి: తోటి ఉద్యోగి వద్ద రూ.8వేల లంచం డిమాండ్ చేసి ఎంపీడీవో, సీనియర్ అసిస్టెంట్ ఏసీబీకి పట్టుబడ్డ సంఘటన మంగళవారం మండల కేంద్రంలోని మండల పరిషత్ కార్యాలయంలో చోటు చేసుకుంది. ప్రస్తుతం భిక్కనూర్ ఎంపీడీవో గా విధులు నిర్వర్తిస్తున్న సంతోష్ రెడ్డి డిమాండ్ చేసిన లంచం డబ్బులను కమ్మర్ పల్లి మండల పరిషత్ కార్యాలయంలో సీనియర్ అసిస్టెంట్ గా విధులు నిర్వహిస్తున్న హరిబాబు తీసుకుంటుండగా ఏసీబీ అధికారులు రెడ్ హ్యాండెడ్ గా పట్టుకున్నారు. ఏసీబీ డిఎస్పి శేఖర్ గౌడ్ తెలిపిన మేరకు వివరాలు ఇలా ఉన్నాయి

గతంలో కమ్మర్ పల్లి మండల పంచాయతీ అధికారిగా విధులు నిర్వహించిన భాగయ్య నాలుగైదు నెలల క్రితం బదిలీపై ఇందల్వాయి వెళ్లి, చందూర్ లో అటాచ్ డ్యూటీ లో ఉన్నారు. బదిలీపై వెళ్లిన భాగయ్య సర్వీస్ రికార్డు బుక్కును ఆ సమయంలో కమ్మర్పల్లి ఎంపీడీవో గా విధులు నిర్వహిస్తున్న సంతోష్ రెడ్డి పంపాల్సి ఉండేది అన్నారు. సర్వీస్ రికార్డు బుక్ పంపకుండా డబ్బులు డిమాండ్ చేశాడని తెలిపారు. రూ.10వేలు ఇస్తేనే పంపిస్తామని చెప్పినట్లు తెలిపారు. తర్వాత రెండు మూడు సార్లు అడిగిన డబ్బులు ఇస్తేనే పంపిస్తామని స్పష్టం చేయడంతో తన వల్ల అంత డబ్బు ఇవ్వడం కాదని బాగయ్య ఎంపిడిఓ సంతోష్ రెడ్డికి చెప్పాడు. నీకు వేరే బిల్స్ కూడా వచ్చాయి అందులో నుండి ఇవ్వచ్చు కదా అని కూడా అడిగినట్లు తెలిపారు. తన వల్ల అంతా కాదని కొంత తగ్గించాలని బాగాయ్య కోరడంతో రూ.8వేలు ఇవ్వాలని అడిగాడు. అడిగిన కొద్ది రోజులకే ఎంపీడీవో సంతోష్ రెడ్డి భిక్కనూరుకు బదిలీపై వెళ్ళాడు. ఎంపీడీవో బదిలీపై వెళ్లడంతో సర్వీస్ రికార్డు బుక్




ట్రాన్స్ఫర్ అవుతుందని భాగయ్య భావించాడు.కానీ మండల పరిషత్ కార్యాలయంలో సీనియర్ అసిస్టెంట్ హరిబాబుకు డబ్బులు ఇస్తేనే సర్వీస్ రికార్డు బుక్ పంపించాలని ఆదేశించి వెళ్ళాడు. భాగయ్య సర్వీస్ రికార్డు బుక్ గురించి అడిగిన హరిబాబు పంపలేదు. డబ్బులు ఇస్తేనే పంపిస్తామని స్పష్టం చేయడంతో ఏం చేయాలో అర్థం కాక ఏసీబీ అధికారులను సంప్రదించాడన్నారు. మంగళవారం మండల పరిషత్ కార్యాలయంలో బాగయ్య నుండి డబ్బులు తీసుకుంటున్న సీనియర్ అసిస్టెంట్

హరిబాబును రెడ్ హ్యాండెడ్ గా పట్టుకొని రూ.8వేలు స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. హరిబాబును అదుపులోకి తీసుకొని విచారించడంతో ఎంపీడీవో సంతోష్ రెడ్డి చెప్పినందునే తాను డబ్బులు తీసుకున్నట్లు స్పష్టం చేయడంతో బదిలీపై భిక్కనూరు వెళ్లిన ఎంపీడీవో సంతోష్ రెడ్డిని బిక్కనూరు మండల పరిషత్ కార్యాలయంలో అదుపులోకి తీసుకున్నట్లు వివరించారు. తొందరలోనే ఏ1 సంతోష్ రెడ్డి, ఏ2 హరిబాబును రిమాండ్ కి పంపిస్తామని ఏసీబీ డీఎస్పీ తెలిపారు. కాగా మండల చరిత్రలో తొలిసారి ప్రస్తుతం విధుల్లో ఉన్న ఒకరు, బదిలీపై మిగిలిన మరొక అధికారి ఏసీబీ అధికారుల వలలో చిక్కుకోవడం సంచలనంగా మారింది. ఈ దాడుల్లో ఏసీబీ సీఐలు నాగేష్, శ్రీనివాస్, వేణు కుమార్ పాల్గొన్నారు.

# తెలంగాణ రాష్ట్ర ఆర్య వైశ్యకార్పొరేషన్ చైర్మన్ కల్వ సుజాత కి సన్మానం



రామన్నపేట, మార్చి 26(తీన్మార్ న్యూస్): ఆర్యవైశ్య మండల నాయకత్వం లో వి3 ఛానల్ చైర్మన్ కాసం సత్యనారాయణ ఆధ్వర్యంలో తెలంగాణ రాష్ట్ర ఆర్యవైశ్య సంఘం కార్పొరేషన్ చైర్మన్ గా నియమితులైన కాల్వ సుజాతను ఆర్యవైశ్య సంఘం రామన్నపేట మండల నాయకత్వం ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్నవారు రామన్నపేట మండల అధ్యక్షుడు ఉప్పు ఈశ్వరయ్య, లక్ష్మాపురం మాజీ సర్పంచ్ ఉప్పు ప్రకాష్, కాసం శేఖర్, ఉప్పు వెంకన్న, ఉప్పు శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

# నర్సరీ ని పరిశీలిస్తున్న ఎంపీఓ శ్రీరాంరెడ్డి




వనపర్తి నియోజకవర్గం ప్రతినిధి, మార్చి 26(తీన్మార్ న్యూస్): పెద్దమందడి మండల పరిధిలోని, వెూజర్ల గ్రామంలో మంగళవారం ఎంపీవో శ్రీరామ్ రెడ్డి నర్సరీని పరిశీలించారు. అదేవిధంగా పల్లె ప్రగతి ప్రకృతి వనం, ఉపాధి హామీ పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఎంపీవో శ్రీరామ్ రెడ్డి మాట్లాడుతూ, నర్సరీలో మొక్కలు ఎండకుండా జాగ్రత్త చర్యలు తీసుకోవాలని అన్నారు. ఉపాధి హామీ కూలీల సంఖ్య పెంచాలి గ్రామాలలో ఎండాకాలం ఉండడంతో ముందు జాగ్రత్తగా త్రాగునీరు చర్యలు చేపట్టాలని అన్నారు. గ్రామాలలో పారిశుధ్య చర్యలు చేపట్టాలి గ్రామ పర్యావనం పచ్చగా ఉంటే గ్రామ ప్రజలు ఆరోగ్యంగా ఉంటారని అన్నారు.

# విద్యార్థుల వికాసానికి చదువుతోపాటు క్రీడలు ముఖ్యం..

**- ఎన్ఎస్ యుఐ ఆధ్వర్యంలో క్రీడా పోటీలు ప్రారంభం..**

డిచ్ పల్లి: తెలంగాణ యూనివర్సిటీ లో"నేషనల్ స్టూడెంట్స్ యూనియన్ ఆఫ్ ఇండియా" 53వ ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకొని యూనివర్సిటీ ఎన్ ఎస్ యుఐ కమిటీ ఆధ్వర్యంలో క్రీడా కార్యక్రమాల ప్రారంభోత్సవానికి ముఖ్యఅతిథిగా యూనివర్సిటీ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ డాక్టర్ ఎం యాదగిరి పాల్గొని ప్రారంభించారు. ఈ సందర్భంగా రిజిస్ట్రార్ ప్రొఫెసర్ డాక్టర్ ఎం యాదగిరి మాట్లాడుతూ యూనివర్సిటీ విద్యార్థుల వికాసానికి చదువుతోపాటు క్రీడలు కూడా ముఖ్యమన్నారు. ప్రతి క్రీడల్లో గెలుపోటములు సహజమని అయన అన్నారు. డాక్టర్ దత్త హరి విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతూ విద్యార్థుల భవిష్యత్తుకు క్రీడలు కూడా భాగమన్నారు.

యూనివర్సిటి ఎన్ఎస్ యుఐ అధ్యక్షులు కోమిర శ్రీశైలం మాట్లాడుతూ యూనివర్సిటీ లో విద్యార్థుల్లో నైపుణ్యం, ఆరోగ్యానికి క్రీడలు ప్రధానమైనవని వివరించారు. విద్యార్థులలో స్నేహభావాన్ని ఈ క్రీడా కార్యక్రమాలు కలగజేస్తాయని పేర్కొన్నారు.

ఈ కార్యక్రమంలో డాక్టర్ శ్రీనివాస్ యూనివర్సిటీ కమిటీ నాయకులు రాజేందర్, సాగర్, నాయక్, నిరంజన్, శ్రీకాంత్, విజయ్, కుమార్, అశ్విన్, అనిల్, నవీన్, అనిల్, నంద తదితరులు పాల్గొన్నారు.

# తాగునీటి సరఫరాపై ఆందోళన వద్దు : సీఎస్ శాంతికుమారి

రాష్ట్రంలోని మూడు ప్రధాన రిజర్వాయర్లలో సరిపడా నీటి లభ్యత ఉందని.. ప్రస్తుత వేసవిలో తాగునీటికి ఎలాంటి ఇబ్బందులు లేవని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి స్పష్టం చేశారు.

తాగునీటి సరఫరాపై జిల్లా కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ తాగునీటి సమస్య తలెత్తకుండా ఇప్పటికే 'సమ్మర్ యాక్షన్ ప్లాన్'ను రూపొందించి జిల్లాలకు నిధులు విడుదల చేయాలని చెప్పారు. రాష్ట్రంలో తాగునీటి సరఫరాకు ఏవిధమైన ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు. ఇప్పటికే బోరు బావుల ఫ్లషింగ్, పైపుల మరమ్మతులు చేపట్టడం పూర్తి చేయడం జరిగిందని చెప్పారు. నిర్వహణ పరమైన లోపాలను ఎప్పటికప్పుడు వెంటనే సవరించి నీటి సరఫరాకు ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. ప్రతీ రోజు గ్రామాలు, పట్టణాల్లో తాగునీటి సరఫరాపై సంబంధిత క్షేత్ర స్థాయి అధికారులు, నోడల్ అధికారులతో టెలీకాన్ఫరెన్స్ నిర్వహించి సమీక్షించాలన్నారు. వేసవికాల కార్యాచరణ ప్రణాళికలో భాగంగా మంజూరు చేసిన పనులన్నీ సకాలంలో పూర్తి చేసేలా ప్రత్యేక చర్యలు చేపట్టాలన్నారు. ప్రధానంగా ఆపరేషన్, మెయింటెనెన్స్‌లపై ప్రత్యేక దృష్టి సారించాలని తెలిపారు. ఇతర రాష్ట్రాలలో ఎదురవుతున్న తాగునీటి సమస్యను మన రాష్ట్రానికి కూడా అన్వయిస్తూ ఆందోళనకరమైన వార్తా కథనాలు వస్తున్నాయన్నారు.

రాష్ట్రంలో ఈ సారి లోటు వర్షపాతం ఉన్నా, ఇక్కడి ప్రధాన జలాశయాలు, ఎస్సారెస్పీ, శ్రీపాద ఎల్లంపల్లి, నాగార్జున సాగర్‌తో గత



సంవత్సరం మాదిరిగానే నీటి మట్టాలున్నందున ఆందోళన అవసరం లేదన్నారు. అయినప్పటికీ ప్రత్యామ్నాయ ఏర్పాట్లను రూపొందించుకోవాలని కలెక్టర్లను ఆదేశించారు. కొన్ని మున్సిపాలిటీలు, గ్రామాల్లో నిర్వహణపరంగా లోపాలొచ్చాయని.. లోపాలను పరిష్కరించినట్లు చెప్పారు. నీటి సమస్యలపై వివిధ మాధ్యమాల ద్వారా వచ్చే వార్తలపై వెంటనే స్పందించి చర్యలు తీసుకోవాలని తెలిపారు. ఏప్రిల్ రెండవ వారం అనంతరం రిజర్వాయర్ల నుండి ఎమర్జెన్సీ పంపింగ్ ను చేపడతామని సి.ఎస్ తెలియచేసారు. హైదరాబాద్ మహా నగరంలో కూడా సరిపడా నీటి సరఫరా చేస్తున్నామని, అయితే, కమర్షియల్ అవసరాల నిమిత్తం డిమాండ్ ఎక్కువగా ఉందని జలమండలి అధికారులు తెలిపారు.

# ప్రశాంతంగా పదవ తరగతి పరీక్షలు

**- అదనపు కలెక్టర్ ముసిని వెంకటేశ్వర్లు**

**- పదవ బెటాలియన్‌లోని పరీక్ష కేంద్రం తనిఖీ**

ఎర్రవల్లి/ఉండవల్లి/గద్వాల టౌన్, మార్చి 26 : జిల్లా వ్యాప్తంగా పదవ తరగతి పరీక్షలు ప్రశాంతంగా కొనసా గుతున్నాయని అదనపు కలెక్టర్ ముసిని వెంకటేశ్వర్లు అన్నారు.

ఎర్రవల్లి మండలంలోని పదో బెటాలియన్‌లో ఉన్న పరీక్ష కేంద్రాన్ని మంగళవారం ఆయన ఆకస్మి కంగా తనిఖీ చేశారు. అధికారులు, సిబ్బందితో మాట్లా డారు. పరీక్షలు కొనసాగుతున్న తీరును తెలుసుకు న్నారు. అనంతరం మాట్లాడుతూ మిగిలిన రెండు పరీక్షలు కూడా సజావుగా జరిగేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఇప్పటివరకు ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగలేదని తెలిపారు. ఆయన వెంట చీఫ్ సూపరింటెండెంట్ సోమశేఖర్‌రెడ్డి, సిట్టింగ్ స్క్వాడ్ ఉదయ్‌కిరణ్, కస్టోడియన్ సువార్త ఉన్నారు. ఉండ వల్లి మండలంలోని మూడు పరీక్ష కేంద్రాల్లో 419 విద్యార్థులకు గాను ప్రాథమిక పాఠశాల పరీక్ష కేంద్రం లో ఒకరు గైర్హాజరు అయినట్లు పరీక్ష నిర్వహణాధికారి శ్రీనివాసులు తెలిపారు. పరీక్ష కేంద్రాలను ఫ్లయింగ్ స్క్వాడ్ రాజు తనిఖీ చేశారు. ఎస్ఐ శ్రీనివాసులు నాయక్ బందోబస్తు ఏర్పాటు



చేశారు.

**7,248 మంది హాజరు**

జిల్లా వ్యాప్తంగా 41 కేంద్రాల్లో నిర్వహిస్తున్న పదవ తరగతి పరీక్షల్లో భాగంగా ఐదవ రోజు మంగళవారం నిర్వహించిన ఫిజికల్ సైన్స్ పరీక్షకు జిల్లా వ్యాప్తంగా 7,248 (96 శాతం) మంది హాజరయ్యారు. రెగ్యులర్ విభాగంలో 7,203 మందికి గాను 7,172 మంది పరీక్ష రాశా రు. 31 మంది గైర్హాజరయ్యారు. 83 మంది ప్రైవేట్ విద్యార్థులకు గాను 76 మంది పరీక్ష రాశారు. ఏడుగురు పరీక్ష రాయలేదు. మొత్తంగా 39 మంది పరీక్షకు గైర్హాజరైనట్లు అధికారులు తెలిపారు. జిల్లా వ్యాప్తంగా పరీక్ష ప్రశాంతంగా కొనసాగినట్లు చెప్పారు.

# దంచికొడుతున్న ఎండలు.. ఈ జిల్లాలకు ఆరెంజ్ అలెర్ట్..!

తెలంగాణలో ఎండలు దంచికొడుతున్నాయి. రాబోయే ఐదురోజుల్లో ఎండల తీవ్రత మరింత పెరుగుతుందని వాతావరణ శాఖ హెచ్చరించింది. ఈ క్రమంలో ఆరెంజ్ అలెర్ట్ జారీ చేసింది.

ఉష్ణోగ్రతలు 45 డిగ్రీల వరకు పెరిగే ఛాన్స్ ఉందని వాతావరణ శాఖ పేర్కొంది. 27 నుంచి 30 వరకు ఆదిలాబాద్, కుమ్రంభీం, నిర్మల్, మంచిర్యాల, జగిత్యాల, నిజామాబాద్, రాజన్న సిరిసిల్ల, పెద్దపల్లి, మహబూబ్‌నగర్, నల్గొండ, నారాయణపేట, ఖమ్మం, మహబూబాబాద్ జిల్లాలకు ఆరెంజ్ అలెర్ట్‌ను జారీ చేసింది.

రాగల ఐదురోజుల పాటు రానున్న ఐదు రోజుల్లో గరిష్ఠ ఉష్ణోగ్రతలు 2 నుంచి 3 డిగ్రీలు పెరిగే అవకాశం వాతావరణ శాఖ అంచనా వేసింది. హైదరాబాద్‌లో ఉష్ణోగ్రతలు 40 డిగ్రీల వరకు నమోదయ్యే ఛాన్స్ ఉందని పేర్కొంది.

ఇప్పటికే పలు జిల్లాల్లో 42 డిగ్రీలను దాటాయి. రాత్రి పూట 26 డిగ్రీల వరకు ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. మంగళవారం




ఆదిలాబాద్ జిల్లా సత్నాల, తలమడుగులో అత్యధికంగా 42.3 డిగ్రీల గరిష్ఠ ఉష్ణోగ్రత నమోదైంది టీఎస్‌డీపీఎస్ తెలిపింది. చాప్రాలలో 42.1, ఆసిఫాబాద్ 42 డిగ్రీలు నమోదవగా.. పలు జిల్లాల్లో 40కిపైగా ఉష్ణోగ్రతలు రికార్డయ్యాయని పేర్కొంది.

# వచ్చే నెలలో ధాన్యం కొనుగోలు కేంద్రాలు

**- ప్రారంభానికి చర్యలు తీసుకోవాలి**

**- అధికారులకు కలెక్టర్ బీఎం సంతోష్ ఆదేశం**

గద్వాల న్యూటౌన్, మార్చి 26 : ధాన్యం కొనుగోలు కేంద్రాలను వచ్చేనెల మొదటి వారంలో ప్రారంభించాలని కలెక్టర్ బీఎం సంతోష్ అన్నారు.

పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో వీటిని అధికారులే ప్రారంభించాలని ఆదేశించారు. యాసంగి ధాన్యం కొనుగోలు, సీఎంఆర్ డెలవరీ, తాగునీటి ఎద్దడి తదితర అంశాలపై రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శాంతికుమారి కలెక్టర్, అధికారులతో మంగళవారం వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు.

అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ పంటల కోతలకు అనుగుణంగా అన్ని మండలాల్లో కొనుగోలు కేంద్రాలను ప్రారంభించాలని చెప్పారు. క్షేత్రస్థాయిలో తనిఖీలు నిర్వహిస్తూ ఎక్కడా ఇబ్బందులు తలెత్తకుండా కొనుగోలు ప్రక్రియను ప్రణాళికాబద్ధంగా పూర్తి చేయాలన్నారు. కొనుగోలు కేంద్రాల వద్ద మౌలిక వసతులు కల్పించాలని, టార్పాలిన్లు, ధాన్యాన్ని శుభ్రం చేసే యంత్రాలు, వెయింగ్ మిషన్లు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. ధాన్యం కొనుగోలులో నాణ్యత ప్రమాణాలు, తేమ శాతం నిబంధనలను పాటించాలన్నారు. అవసరమైన వాహనాలు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. కొనుగోలు కేంద్రాల నుంచి ధాన్యాన్ని సకాలంలో మిల్లర్లకు కేటాయించాలని, రైస్‌మిల్లు వద్ద ధాన్యం కోత రాకుండా చర్యలు తీసుకోవాలన్నారు. ఖరీఫ్ 2023-24 సీజన్‌కు సంబంధించి సీఎంఆర్, రా-రైస్ భారత ఆహార సంస్థకు సకాలంలో చేర్చేలా పర్యవేక్షించాలని ఆదేశించారు. సమావేశంలో అదనపు కలెక్టర్లు అపూర్వ చౌహాన్, ముసి ని వెంకటేశ్వర్లు, డీఎస్‌వో రేవతి, డీఆర్‌డీవో నర్సింగరావు, జిల్లా అధికారులు పాల్గొన్నారు.

## ఎన్నికలు సజావుగా నిర్వహించాలి

త్వరలో జరుగనున్న సాధారణ లోక్‌సభ ఎన్నికలు సజావుగా జరిగేలా చూడాల్సిన బాధ్యత అందరిపై ఉన్నదని కలెక్టర్ బీఎం సంతోష్ అన్నారు. కలెక్టర్ కార్యాలయంలోని వీడియో కాన్ఫరెన్స్ హాలులో మంగళవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. జిల్లాలోని గద్వాల, అలంపూర్ నియోజకవర్గాలకు మొదటి దశ ఆన్‌లైన్ ర్యాండమైజేషన్ ద్వారా పోలింగ్ సిబ్బందిని కేటాయించినట్లు తెలిపారు. ప్రక్రియ పూర్తి చేసిన వివరాలను స్క్రీన్‌పై ప్రదర్శించారు. ఎంపికైన పీవో, ఏపీవోలకు వచ్చేనెల 15, 16 తేదీల్లో మాస్టర్ ట్రైనర్లతో శిక్షణా తరగతులు నిర్వహించనున్నట్లు తెలిపారు. సమావేశానికి అదనపు కలెక్టర్ అపూర్వచౌహాన్, ఎన్నికల సూపరింటెండెంట్ నరేష్, సీపీవో లక్ష్మణ్, ఈడీఎం శివ హాజరయ్యారు.

# నైతిక ఓటింగ్ పై 5 కే రన్.. జెండా ఊపి ప్రారంభించిన కలెక్టర్ హరిచందన

నల్లగొండ : ప్రపంచంలోనే అతి పెద్ద ప్రజాస్వామ్యం మనదే అని, కుల, మత, లింగభేదం తేడా లేకుండా రాజ్యాంగం అందరికీ సమానంగా ఓటు హక్కును కల్పించిందని జిల్లా కలెక్టర్ దాసరి హరిచందన అన్నారు. ఓటు అనే ఆయుధం ద్వారా మంచి నాయకున్ని ఎన్నుకుంటే భవిష్యత్తు బాగుంటుందన్నారు. పలాన వారికి వేయాలని ఎవరో చెప్తే మీరు ఓటు వేయొద్దని, మీ ఆత్మ సాక్షిగా నైతిక ఓటు వేయాలని ఆమె పిలుపునిచ్చారు.

మంగళవారం ఆమె ఓటరు అవగాహన కార్యక్రమంలో భాగంగా నల్లగొండ పట్టణంలో నైతిక ఓటింగ్ పై నాగార్జున కళాశాల మైదానం నుంచి స్థానిక గడియారం సెంటర్ వరకు నిర్వహించిన 5 కే రన్‌ను జెండా ఊపి ప్రారంభించారు. అనంతరం ఆమె స్థానిక గడియారం సెంటర్లో మాట్లాడుతూ.. ఎన్నికల సంఘం ఈ ఎన్నికలలో 85 సంవత్సరాలు నిండిన ఓటర్లకు, దివ్యాంగ ఓటర్లకు హెూమ్ ఓటింగ్ సదుపాయం కల్పించిందని తెలిపారు.




హెూమ్ ఓటింగ్ వేయాలనుకునే ఓటర్లు ఫామ్- 12 డి ద్వారా దరఖాస్తు చేసుకోవాలని, లేదా సాక్ష్యం యాప్ ద్వారా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకునే అవకాశం ఉందని చెప్పారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ రాములు నాయక్, జెడ్పీ సీఈవో ప్రేమ్ కరణ్ రెడ్డి, డిఆర్డిఏ పిడి నాగిరెడ్డి, రెడ్ క్రాస్ సొసైటీ సభ్యులు డాక్టర్ పుల్లారావు పాల్గొన్నారు.

# ఉప్పల్ మ్యాచ్.. ప్రేక్షకులు వీటిని తీసుకురావొద్దు : పోలీస్ కమిషనర్

హైదరాబాద్: ఉప్పల్ స్టేడియంలో మ్యాచ్ కోసం 2,500 మంది పోలీస్ సిబ్బందితో బందోబస్తు ఏర్పాటు చేయనున్నట్టు రాచకొండ పోలీస్ కమిషనర్ తరుణ్ జోషి తెలిపారు.

బుధవారం రాత్రి ముంబయి ఇండియన్స్- సన్ రైజర్స్ హైదరాబాద్ మధ్య తొలి మ్యాచ్ జరగనుంది. స్టేడియం వద్ద 360 సీసీ కెమెరాలు ఏర్పాటు చేసినట్టు చెప్పారు. సీటింగ్ సామర్థ్యం 39 వేలు ఉందని, స్టేడియం లోపల, వెలుపల భారీగా పోలీసులను మోహరిస్తామని తెలిపారు.

ల్యాప్ ట్యాప్, వాటర్ బాటిల్స్, బ్యానర్స్, లైటర్స్, సిగరెట్స్, బైనాక్యులర్స్‌పై నిషేధమని, స్టేడియం లోపలికి ఎలాంటి వస్తువులు తీసుకురావొద్దని స్పష్టం చేశారు. బ్లూటూత్స్ అనుమతిస్తామన్నారు. స్టేడియం పరిసరాల్లో షీ టీమ్స్ నిఘా ఉంటుందన్నారు. మ్యాచ్‌కి 3గంటల ముందు నుంచి ప్రేక్షకులను అనుమతిస్తామన్నారు. నాలుగు అంబులెన్స్‌లు, మెడికల్ టీమ్స్, ఫైర్ ఇంజిన్లను సిద్ధంగా ఉంచుతామని తెలిపారు. టికెట్



కొనుగోలు చేసిన వారి కోసం పార్కింగ్ సదుపాయం కల్పించామన్నారు. స్టేడియం వద్ద బ్లాక్ టికెట్స్ అమ్మితే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. మ్యాచ్ నిర్వహణ కోసం పోలీస్ శాఖ తరపున అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్టు సీపీ చెప్పారు.

# బీజేపీని ఓడించండి.భారత రాజ్యాంగాన్ని కాపాడండి: తమ్మినేని

**- భువనగిరి పార్లమెంట్ నియోజకవర్గంలో నిరంతరం పేదల కోసం పోరాడే సీపీఐ(ఎం) అభ్యర్థిని గెలిపించండి..**

**- సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం పిలుపు**

భువనగిరి: భారత రాజ్యాంగాన్ని మార్చాలని కుట్ర చేస్తున్న బీజేపీని పార్లమెంట్ ఎన్నికల్లో ఓడించాలని నిరంతరం ప్రజా సమస్యలపై పోరాడే సీపీఐ(ఎం) అభ్యర్థిగా భువనగిరి నియోజకవర్గవర్గం నుండి పోటీ చేస్తున్న జహంగీర్ ను గెలిపించాలని సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం పిలుపునిచ్చారు. మంగళవారం భువనగిరి పట్టణంలో ఏఆర్ గార్డెన్ లో ముదిరెడ్డి సుధాకర్ రెడ్డి అధ్యక్షతన జరిగిన భువనగిరి పార్లమెంట్ నియోజకవర్గ సమావేశంలో తమ్మినేని వీరభద్రం ముఖ్య అతిథిగా పాల్గొన్న మాట్లాడారు. దేశం అత్యంత క్లిష్టమైన పరిస్థితుల్లో ఉన్న సమయంలో పార్లమెంట్ ఎన్నికలు జరుగుతున్నాయన్నారు. దేశంలో భారత రాజ్యాంగాన్ని సంపూర్ణంగా మార్చి ఆ స్థానంలో మనుధర్మాన్ని తిసోకోచ్చి ఫ్యూడల్ పద్ధతులు ప్రవేశ పెట్టడం కోసం కృషి చేస్తుందని అన్నారు. దీని ద్వారా కుల, మత, ప్రాంత విద్వేషాలు సృష్టిస్తుందన్నారు. దీనికి అడ్డుగా ఉన్న భారత రాజ్యాంగాన్ని మార్చడమే ధ్యేయంగా పనిచేస్తుందన్నారు. ఇప్పటికే సిఏఏ,పౌరసత్వ రద్దు, జ్యోతిష్య శాస్త్రఅమలు, విద్యా కాషాయికరణ, ఈడీ, సీబీఐ లాంటి సంస్థలను ఉపయోగించి ప్రతిపక్షాలను భేదించడం, లొంగదీసుకోవడం, మేధావులను జైల్లల్లో పెట్టడం లాంటి వాటిని బలవంతంగా అమలు చేస్తుందన్నారు. బీజేపీ గత ఎన్నికల ముందు రైతులను రెట్టింపు ధనవంతులను చేస్తామని చెప్పిందన్నారు. నల్ల డబ్బును బయటికి తీసి దేశ ప్రజల ఖాతాల్లో ప్రతి ఒక్కరికి 15లక్షలు జమ చేస్తామని చెప్పిందన్నారు. కానీ బీజేపీ అధికారంలోకి వచ్చాక అవినీతికి చట్టబద్ధత కలిగించిందన్నారు. ఎలెక్ట్రోల్ బాండ్స్ రూపంల్ 1600 కోట్ల రూపాయల్లో 800 కోట్ల రూపాయలు బీజేపీకి చేరాయన్నారు. ఈ ఎలెక్ట్రోల్ బాండ్స్ చట్ట విరుద్ధమైనవని సిపిఎం పోరాడిందన్నారు. సుప్రీంకోర్టు జోక్యం చేసుకోవడం వల్ల అవినీతి బయటికి వచ్చిందన్నారు విద్యా రంగానికి కేవలం,4% మాత్రమే నిధులు కేటాయించారని విద్యను పూర్తిగా ప్రయివేటికరణ చేశారన్నారు. ఆకలి శుచిలో మనదేశం 111 స్థానంలో ఉందన్నారు లిక్కర్ కేసులో బీజేపీకి ఆరవిండో పార్మా కంపెనీ అధినేత శరత్ చంద్రారెడ్డి ద్వారా 60 కోట్ల రూపాయల ముడుపులు ముట్టాయన్నారు. నాడు వ్యాపారస్తులు వేరు రాజకీయ నాయకులు




వేరుగా ఉండేవారని అన్నారు. నేడు వ్యాపారస్థులే రాజకీయ నాయకులుగా మారారన్నారు. వేల కోట్ల రూపాయలు అధిపతులు పోటీ చేస్తున్నారని వారు ఇంకా ఎక్కువ సంపాదించడానికి ప్రయత్నాలు చేస్తారన్నారు. అందుకే నిరంతరం నిజాయితీగా నికరంగా ప్రజా సమస్యలపై పోరాడే సిపిఎం భువనగిరి పార్లమెంట్ అభ్యర్థిగా పోటీ చేస్తున్న జహంగీర్ ను ఈ ఎన్నికల్లో నిలబెట్టామని ఆయనను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. సీపీఐ(ఎం) కేంద్ర కమిటీ సభ్యులు చెరుపల్లి సీతారాములు,రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు ఎస్,వీరయ్య,జూలకంటి రంగారెడ్డి లు మాట్లాడుతూ భువనగిరి పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలోని ప్రజలందరికీ సీపీఐ(ఎం) చేసిన పోరాటాలు తెలుసన్నారు సిపిఎం పోరాటాల ఫలితంగా పేదలకు భూములు, ఇండ్ల స్థలాలు సాధించిపెట్టారన్నారు. నేడు ప్రజలు అనుభవిస్తురన్నారు నకిరేకల్, ఇబ్రహీంపట్నం, జనగామ, తుంగతుర్తి నియోజకవర్గాల్లో ఎమ్మెల్యేలు గెలిచి ప్రజల కోసం పనిచేసారన్నారు. భువనగిరి పార్లమెంట్ ఏర్పడిన 2009 ఎన్నికల నుండి సీపీఐ(ఎం) పోటీ చేస్తుందన్నారు. ఈ పార్లమెంట్ పరిధిలో సీపీఐ(ఎం) అనేక ప్రజా పోరాటాలు నిర్వహించిందన్నారు. ఈ ఎన్నికల్లో పోటీ చేస్తున్న సీపీఐ(ఎం) అభ్యర్థి జహంగీర్ ను ప్రజలు ఓటు వేసి గెలిపించాలని కోరారు.

ఈ సమావేశంలో సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు మల్లు లక్ష్మీ, సీపీఐ(ఎం) ఎంపీ అభ్యర్థి ఎండి. జహంగీర్, రంగారెడ్డి, సూర్యాపేట, జనగామ, సిద్దిపేట, సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శులు కాడిగళ్ల భాస్కర్, మల్లు నాగార్జున రెడ్డి, మోకు కనకరెడ్డి, ఆముదాల మల్లారెడ్డి, రాష్ట్ర కమిటీ సభ్యులు తుమ్మల వీరారెడ్డి, నారి ఐలయ్య, కొండమడుగు నర్సింహ, బట్టుపల్లి అనురాధ, పైళ్ల ఆశయ్య, ఎంవి రమణ, డబ్బికార్ మల్లేశం, సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు మంగ నర్సింహ, మాటూరి బాలరాజు, కల్లూరి మల్లేశం, దొనూరి నర్సిరెడ్డి పాల్గొన్నారు.

# ఫోన్ ట్యాపింగ్ కేసులోకి ఏసీబీ ఎంట్రీ..

హైదరాబాద్: ఫోన్ ట్యాపింగ్ కేసులోకి అవినీతి నిరోధక శాఖ ఎంట్రీ ఇవ్వనుంది. పోలీసు అధికారుల అక్రమ ఆస్తులపై ఏసీబీ దృష్టిసారించింది.

ఎస్ఐబీ డీఎస్పీ ప్రణీత్ రావు ఆధ్వర్యంలో ఫోన్ ట్యాపింగ్ వ్యవహారం నడిచిన విషయం తెలిసిందే. ఈ కేసులో ప్రణీత్‌రావుతోపాటు ఇద్దరు అధికారులను అరుస్టు చేశారు. మరో ముగ్గురు పరారీలో ఉన్నారు. కేసు దర్యాప్తులో భాగంగా రాజకీయ నాయకులు, వ్యాపారులు, హవాలా, రియల్ ఎస్టేట్ వ్యాపారుల నుంచి డబ్బులు వసూళ్లకు పాల్పడినట్లు ఆరోపణలు ఉన్నాయి. ఆ డబ్బుతో విల్లాలు కొనుగోలు, ఆర్థిక లావాదేవీలపై అధికారులు ఆరాతీస్తున్నారు. త్వరలోనే ఆయా అధికారుల ఇండ్లలో ఏసీబీ తనిఖీలు జరిగే అవకాశం ఉన్నట్లు తెలుస్తున్నది.

ప్రణీత్‌రావు కస్టడీలో ఇచ్చిన స్టేట్‌మెంట్ ఆధారంగా ఎస్ఐబీ మాజీ అదనపు ఎస్పీలు భుజంగరావు, తిరుపతన్నను అరెస్టు చేయడంతో న్యాయస్థానం వాళ్లిద్దరికి 14 రోజులు రిమాండ్ విధించింది. ఈ ముగ్గురు ప్రస్తుతం చంచల్‌గూడ జైలులో ఉన్న సంగతి తెలిసిందే. అయితే, ఇద్దరు ఏఎస్పీలను కస్టడీకి ఇవ్వాలంటూ ఇప్పటికే పంజాగుట్ట పోలీసులు కోర్టును ఆశ్రయించడంతో నేడు ఈ పిటిషన్‌పై వాదనలు జరిగే అవకాశాలున్నాయి. మావోయిస్టులు, టెర్రరిస్టులు, దేశ భద్రతకు ముప్పు వాటిల్లుతుందని భావించే వారి ఫోన్ నంబర్లను అధికారికంగా దేశంతోపాటు ఆయా రాష్ట్రాల ఇంటెలిజెన్స్ వ్యవస్థలు ఎప్పటికప్పుడు ట్రాక్ చేస్తూ ఉంటాయి. దీనిని ఆసరగా చేసుకొని ప్రణీత్‌రావు, భుజంగరావు, తిరుపతన్నలు రాజకీయ నాయకులు, వ్యాపారవేత్తలకు పనిచేశారని విచారణలో విచారణలో తేలింది. ఎస్ఐబీలో ఎప్పటి నుంచి ప్రైవేట్ వ్యక్తుల ఫోన్లను ట్యాప్ చేశారు? నిబంధనలకు విరుద్ధంగా వాడుతున్న సాఫ్ట్‌వేర్లు ఏమిటి? అనే అంశాలపై ప్రణీత్‌రావును ప్రత్యేక బృందం ప్రశ్నించినట్టు తెలిసింది.

భుజంగరావు, తిరుపతన్నలు ప్రణీత్‌రావుపై అధికారుల నుంచి వచ్చిన ఆదేశాలతోపాటు వ్యాపారులు, అక్రమ దందాలు చేసేవారి నంబర్లను ట్యాప్ చేసి అక్రమ సంపాదనకు కూడా తెరలేపినట్టు విచారణలో బయటపడింది. అక్రమ సంపాదనతో కొన్న ఆస్తులు బినామీల పేర్లపై రిజిస్ట్రేషన్ చేయించినట్టు పోలీసులు అనుమానిస్తూ ఆ దిశగా దర్యాప్తు జరుపుతున్నారు. చాదర్‌ఘాట్ వద్ద మూసీలో పడవేసిన హార్డ్‌డిస్కుల



శకలాలను పోలీసులు స్వాధీనం చేసుకున్నట్టు తెలిసింది. కాగా, ఎస్ఐబీలో పనిచేసే కొందరు అధికారులు ఫోన్ ట్యాపింగ్ పాల్పడుతున్నట్టు తమకు సమాచారం ఉన్నదని, అలా చేయడం నేరమంటూ వారించడంతో తమను ఇతర విభాగాలకు బదిలీ చేశారంటూ కొందరు అధికారులు చర్చించకుంటున్నారు. అలాంటి వారిని కూడా ప్రస్తుతం దర్యాప్తు అధికారులు ఆరా తీసి, ఈ కేసులో సాక్షలుగా చేర్చే అవకాశాలున్నాయి.

ఎస్ఐబీ టెక్నికల్ కన్సల్టెంట్‌గా పనిచేసిన రవి అనే వ్యక్తి ఇజ్రాయెల్ నుంచి ఫోన్ ట్యాపింగ్ డివైస్, సాఫ్ట్‌వేర్లు తెప్పించారని విచారణలో బయటకు వచ్చింది. ఈ సాఫ్ట్‌వేర్‌ను ఉపయోగించి విపక్షాలు, రాజకీయ నాయకుల ఫోన్లు ట్యాప్ చేశారని చర్చ జరుగుతున్నది. ఫోన్ ట్యాపింగ్ చేయలంటే తప్పని సరిగా ఆయా సెల్‌ఫోన్ ప్రొవైడర్ల అనుమతి తప్పనిసరి. కానీ, నిబంధనలు ఉల్లంఘించి సాఫ్ట్‌వేర్లతో ఫోన్లను హ్యాక్ చేయడం చట్టపరిధిని దాటి చేయడమేనని కొందరు అధికారులు తెలిపారు. ఈ కేసులో టెక్నికల్ కన్సల్టెంట్‌ను పోలీసులు విచారించేందుకు సిద్ధమవుతున్నారు. ఇతడిచ్చే సమాచారంతో ఫోన్ హ్యాకింగ్ సాఫ్ట్‌వేర్‌పై మరింత స్పష్టత వచ్చే అవకాశాలున్నాయి. అసలు ఇజ్రాయెల్ నుంచి తెచ్చిన సాఫ్ట్‌వేర్ ఏంటి అనే సమాచారాన్ని పోలీసులు తెలుసుకోనున్నారు.

# నెల్లోగా ప్రాథమిక నివేదిక వచ్చేనా !?

**- లోతుగా అధ్యయనం**

**- కాళేశ్వరం బ్యారేజీల్లో అనేక లోపాలు: అధికారులు, ఇంజినీర్ల భేటీలో ఒక్కొక్కటిగా వెలుగులోకి**

హైదరాబాద్: కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మాణంలో ఒకటి కాదు, రెండు కాదు అనేక లోపాలు బయటపడుతున్నాయి. నేషనల్ డ్యామ్ సేఫ్టీ అథారిటీ(ఎన్‌డీఎస్ఏ) నియమిత నిపుణల కమిటీ మలిదఫా పర్యటనలో సాంకేతిక అంశాలు కమిటీ దృష్టికొస్తున్నాయి. స్థలం మార్పిడి దగ్గర నుంచి మొదలెడితే నిర్మాణానికి అనుసరించాల్సిన మెథడాలజీలోనూ ఘోరమైన తప్పులు దొర్లినట్టు తెలిసింది. కమిటీ చైర్మెన్ చంద్రశేఖర్ అయ్యర్ నేతృత్వంలోని నిపుణుల కమిటీ ఉన్నతాధికారులు, ఇంజినీర్లు, సెంట్రల్ డిజైన్ బృందాలతో విడివిడిగా విచారిస్తున్న క్రమంలో ప్రాజెక్టు పనికి వస్తుందా ? రాదా ? అనే అనుమానాలు నిపుణుల కమిటీకి వచ్చినట్టు సమాచారం. కమిటీ మూడు రోజుల రాష్ట్ర పర్యటన గత శుక్రవారం ముగిసింది. రెండు రోజులు హైదరాబాద్‌లోని జలసౌధలో అధికారులతో సమావేశమయ్యారు. మాజీ ఈఎన్సీలు సి.మురళీధర్‌రావు, నల్లా వెంకటేశ్వర్లును సైతం విచారించింది. ముఖ్యకార్యదర్శి రాహుల్ బొజ్జా, ప్రత్యేక కార్యదర్శి ప్రశాంత్‌జీవన్ పాటిల్, ఈఎన్సీ జనరల్ బి అనిల్‌కుమార్‌తోనూ చర్చించారు. పర్యటనకు వచ్చిన తొలిరోజే సాగునీటి పారుదల శాఖ మంత్రి ఎన్.ఉత్తమ్‌కుమార్‌రెడ్డితోనూ భేటి అయ్యారు. వీరందరితోనూ సమావేశమై వివరాలు తెలుసుకున్న తర్వాత ప్రాథమిక నివేదిక నెలరోజుల్లో వచ్చే అవకాశాలు కనిపించడం లేదని సాగునీటి శాఖ అధికారులే అంటున్నారు. జలసౌధలో దీనిపై చర్చోపచర్చలు సాగుతున్నాయి. ఒక్కొక్కటిగా విస్తుపోయే అంశాలు బయటకు



వస్తుండటంతో నిపుణుల కమిటీ నెలరోజుల్లో నివేదిక ఇచ్చే విషయమై పునరాలోచిస్తున్నట్టు తెలిసింది. దాదాపు 19 రకాల సమాచారాన్ని ప్రభుత్వాన్ని అడిగిన విషయం విదితమే. ఇప్పటికే దాదాపు అంతా ఇచ్చినట్టు తెలిసింది. కాగా ప్రాజెక్టు నిర్మాణంలో ప్రాథమిక సూత్రాలను బీఆర్ఎస్ సర్కారు పాటించలేదనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. మేడిగడ్డ, అన్నారం బ్యారేజీల మధ్య నిర్మాణంలో అనేక తేడాలు ఉన్నట్టు కమిటీ గుర్తించినట్టు సమాచారం. మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బ్యారేజీల్లో చోటుచేసుకున్న పొరపాట్లు, తప్పుల మూలంగా మొత్తం ప్రాజెక్టే ప్రశ్నార్థమయ్యే అవకాశాలు లేకపోలేదని సాగునీటిరంగ నిపుణులు చెబుతున్నారు. సెంట్రల్ డిజైన్ ఇంజినీర్లతో బేటి సందర్భంగా కీలకమైన విషయాలు బయటకొచ్చాయని తెలిసింది. ఇదిలావుండగా విజిలెన్స్ డైరెక్టర్ జనరల్ రాజీవ్‌రతన్‌తోనూ నిపుణుల బృందం భేటి అయింది. వాళ్ల దృష్టికొచ్చిన సాంకేతిక అంశాలను ఆరా తీసినట్టు సమాచారం. డీపీఆర్‌కు కేంద్ర జలసంఘం ఆమోదం లేకుండానే నిర్మాణ కంపెనీ ఒప్పందం చేసుకోవడం వెనుక కారణాలను అడిగి తెలుసుకున్నట్టు తెలిసింది. మూడు బ్యారేజీలకు చెందిన అపరేషన్, నిర్వహణ అంశాలపై చర్చించినట్టు సమాచారం.

# నగరంలో విస్తృత తనిఖీలు

**- భారీగా పట్టుబడుతున్న నగదు**

**- మద్యం, విలువైన వస్తువులు**

**- హైదరాబాద్ జిల్లాలో ఇప్పటివరకు రూ. 2.24కోట్లు సీజ్**

సిటీ: పార్లమెంట్ ఎన్నికలను ప్రశాంత వాతావరణంలో పూర్తి చేసేందుకు జీహెచ్ఎంసీ, పోలీస్ అధికారులు కసరత్తు చేస్తున్నారు. జిల్లా ఎన్నికల అధికారి, జీహెచ్ఎంసీ కమిషనర్ రోనాల్డ్ రోస్ ఆదేశాలతో హైదరాబాద్ నగర వ్యాప్తంగా ప్రత్యేక చెక్‌పోస్టులు ఏర్పాటు చేసిన విస్తృత తనిఖీలు నిర్వహిస్తున్నారు. ఇప్పటి వరకు రూ. 2.24కోట్లను స్వాధీనం చేసుకున్నారు. గత శనివారం వరకు జిల్లాలో ఎన్‌ఫోర్స్‌మెంట్ బృందాలు రూ. 1,73,60,800ను సీజ్ చేయగా, రూ. 23,61,964 విలువైన ఇతర వస్తువులు, 314.45



లీటర్ల అక్రమ మద్యంను పట్టుకున్నారు. సోమవారం రూ. 4,60,000 సీజ్ చేశారు. ఎన్నికల ప్రవర్తన నియమావళిలో భాగంగా ఆదివారం ఉదయం 6 గంటల నుంచి సోమవారం ఉదయం 6 గంటల వరకు హైదరాబాద్ జిల్లాలో వివిధ ప్రాంతాల్లో ఎన్‌ఫోర్స్‌మెంట్, జీహెచ్ఎంసీ అధికారులు తనిఖీలు చేశారు. రూ. 4,60,000, రూ. 3,06,193 విలువ గల వివిధ రకాల వస్తువులను స్వాధీనం చేసుకున్నారు. ఫ్లయింగ్ స్క్వాడ్ ద్వారా రూ. 3,45,000 సీజ్ చేయగా, పోలీస్‌ల ద్వారా రూ. 1,15,000 పట్టుకున్నారు. నగదు, ఇతర వస్తువుల రవాణాపై 22 ఫిర్యాదులు రావడంతో అధికారులు వాటిని పరిశీలించారు. 20 ఎఫ్ఐఆర్‌లు నమోదు చేశారు.

ఇక 360.90 లీటర్ల మద్యాన్ని పట్టుకున్న పోలీసులు, 20 మందిపై కేసులు నమోదు చేసి అరెస్టు చేశారు. ఎన్నికల నిబంధనలను ఎవరు అతిక్రమించినా చట్టప్రకారం చర్యలు తీసుకుంటామని జిల్లా ఎన్నికల అధికారి రోనాల్డ్ రోస్ హెచ్చరించారు. ఇదిలావుండగా, ఎన్నికల నోటిఫికేషన్ జారీ అయినప్పటి నుంచి ఇప్పటి వరకు రూ. 2 కోట్ల 24 లక్షల 81 వేల 800, 32 లక్షల 91 వేల 571 రూపాయల విలువైన వివిధ వస్తువులు,1045.065 లీటర్ల మద్యం పట్టుబడింది. 61 మందిపై కేసులు నమోదు చేసి అరెస్టు చేశారు.

# వామపక్ష విద్యార్థుల విజయం మనువాదులకు చెంపపెట్టు

హైదరాబాద్: జవహర్‌లాల్ నెహ్రూ విశ్వవిద్యాలయం (జేఎన్‌యూ)లో వామపక్ష విద్యార్థుల విజయం మనువాదులకు చెంపపెట్టు లాంటిదని భారత విద్యార్థి ఫెడరేషన్ (ఎస్ఎఫ్ఐ) రాష్ట్ర కమిటీ పేర్కొంది. దేశ రాజధాని ఢిల్లీలో మతోన్మాద ఏబీవీపీని ఓడించి వామపక్ష విద్యార్థి సంఘాలను గెలిపించిన ఆ వర్సిటీ విద్యార్థులకు జేజేలు తెలిపింది. ఈ మేరకు ఎస్ఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్షులు ఆర్ఎల్ మూర్తి, కార్యదర్శి టి నాగరాజు సోమవారం ఒక ప్రకటన విడుదల చేశారు. మోడీ ప్రభుత్వం ప్రజలపై భారాలు మోపుతున్నదనీ, కార్పొరేట్ వర్గాలకు మేలు చేసేలా అమెరికా, ప్రపంచ బ్యాంకు విధానాలను అమలు చేస్తున్నదని విమర్శిం చారు. నూతన విద్యావిధానం-2020ని తెచ్చి విద్యారంగంలో ఆర్ఎస్ఎస్ ఎజెండాను అమలు చేయాలని చూస్తున్నదని తెలిపారు. ప్రభుత్వ విశ్వవిద్యాలయాలను ఒకే గొడుగు కిందకు తేవాలనే పేరుతో సీయూఈటీని తెచ్చిందని పేర్కొన్నారు. పరీక్షల నిర్వహణ కోసం ఎన్ టీఏను ఏర్పాటు చేసి ఫీజులు దండుకుంటున్నదని విమర్శించారు. విశ్వవిద్యాలయాల స్వయం ప్రతిపత్తిని నాశనం చేస్తూ కావాలనే నిధులు కేటాయించకుండా ఫీజులను భారీగా పెంచి ఇప్పడిప్పుడే కింది వర్గాల నుంచి ఉన్నత చదువుల కోసం వర్సిటీలకు వస్తున్న విద్యార్థులపై భారాలను మోపుతున్నదని తెలిపారు. వారిని ఉన్నత విద్యకు దూరం చేసే కుట్ర దాగి ఉన్నదని పేర్కొన్నారు. జేఎన్‌యూలో మతోన్మాదులను ఎలాగైనా గెలిపించేందుకు ఏబీవీపీకి అనుకూలంగా జేఎన్‌యూ వర్సిటీ పరిపాలనా విభాగం పనిచేసిందని విమర్శించారు. అందులో భాగంగానే లెఫ్ట్ కూటమి ప్రధాన కార్యదర్శి అభ్యర్థిని పోలింగ్‌కు రెండురోజుల ముందు అనర్హులుగా ప్రకటించారని తెలిపారు. వర్సిటీలోకి ఆర్ఎస్ఎస్ వ్యక్తులు, బీజేవైఎంకు చెందిన వ్యక్తులు ప్రవేశించి విద్యార్థులపై దాడులు చేశారని పేర్కొన్నారు. ఎన్నికల్లో ఎలాగైనా గెలిచేందుకు డబ్బు, ఇతర ప్రలోభాలకు గురి చేశారని వివరించారు. అయినా దేశాన్ని, ప్రజాస్వా మ్యాన్ని కాపాడే భాధ్యత విశ్వవిద్యాలయ విద్యార్థులు తీసుకున్నారని తెలిపారు.ఇదే స్ఫూర్తితో రానున్న పార్లమెంటు ఎన్నికల్లో మోడీని కూడా ఓడించాలనీ, దేశంలో ప్రజాస్వామ్యం, విద్వేషాలు, విభజనలు లేని, స్వేచ్ఛ కోసం పోరాడాలని విద్యార్థి లోకానికి వారు పిలుపునిచ్చారు.

# వరంగల్ రీజినల్ పరిధిలో మద్యం రీసైక్లింగ్ దందా

వరంగల్ : దొరికినంత దోచేయ్.. అవసరమున్నంత దాచెయ్ అన్నచందంగా మారింది ఎక్సైజ్‌లో అక్రమార్కుల పనితీరు. మద్యం నియంత్రణ ఉద్దేశంతో దాడులు సాగుతున్నప్పటికీ ఎక్సైజ్‌లోని కొంతమంది అధికారుల లక్ష్యం మాత్రం మద్యాన్ని నొక్కేయడమే అన్నట్లుగా మారింది.

మద్యం వ్యాపారంలో దుకాణాదారులు రింగవడం కామన్.. కానీ మద్యం నియంత్రణశాఖలోని అధికారులు ఒక్కటై మద్యం రీసైక్లింగ్ దందాకు తెగపడుతున్నారు. స్వకార్యం, స్వామికార్యం అన్నట్లుగా అనుమతిలేకుండా మద్యం విక్రయాలు జరుపుతున్న దుకాణాలు, రవాణా చేస్తున్న మార్గాల్లో కాపు కాసి పట్టుకుంటున్న ఎక్సైజ్ అధికారులు.. దొరికిన మద్యాన్ని పెద్ద మొత్తంలో మాయం చేసేస్తున్నట్లు తెలుస్తోంది.

మాయం చేసిన మద్యాన్ని దాచేసి.. మళ్లీ తమకు తెలిసిన మద్యం దుకాణాలు, బెల్ట్‌షాపులకే విక్రయిస్తూ సొమ్ము చేసుకుంటున్నారు. వరంగల్ డిప్యూటీ కమిషనరేట్ పరిధిలోని ఎక్సైజ్ శాఖలో సీజ్‌రింగ్ యవ్వారం జోరుగా సాగుతోంది. మద్య నియంత్రణకు కృషి చేయాల్సిన డిపార్ట్‌మెంట్ సిబ్బంది మద్యం సేల్స్‌కు తెరలేపుతుండటం గమనార్హం. మద్యం సీజ్ చేయగానే రికార్డులు నమోదు చేయడం, పై అధికారులకు ఎప్పటికప్పుడు నివేదించడం చేయాల్సి ఉంటుంది. అయితే ఇందులోనూ లోసుగులే ఉన్నట్లుగా తెలుస్తోంది.

**తొర్రూరు ఘటనే నిదర్శనం..**

గత అసెంబ్లీ ఎన్నికల సమయంలో వివిధ గ్రామాల్లో పట్టుబడిన మద్యాన్ని ఎక్సైజ్ అధికారులు సీజ్ చేసి స్టేషన్‌లో భద్రపరించారు. ఈ మద్యాన్ని ఎక్సైజ్ సీఐ భాస్కరరావు సెలవు మీద ఉండగా, హోలీ పండుగ అదునుగా చూసుకున్న ఎక్సైజ్ ఎస్ఐ రవళి రెడ్డి రూ. 50వేల విలువ కలిగిన మద్యాన్ని స్టేషన్ నుంచి తరలింపునకు ఆదేశించినట్లుగా తెలుస్తోంది. కార్యాలయం నుంచి నేరుగా ఓ మద్యం దుకాణానికి ఈ సరుకును తీసుకెళ్లినట్లుగా సమాచారం. ఆటోలో మద్యాన్ని తరలిస్తున్న వీడియోలు కూడా లభ్యమవడం గమనార్హం. తొర్రూరు డివిజన్ కేంద్రంలోని ఎక్సైజ్ స్టేషన్‌లో ఇలాంటి ఘటనలో గతంలోనూ జరిగాయని డిపార్ట్‌మెంట్ వర్గాల నుంచే వ్యక్తమవుతుండటం గమనార్హం. గతంలో ముగ్గురు అధికారులు కూడా సీజ్ చేసిన మద్యం విషయంలో గోల్‌మాల్ చేయడంతోనే వేటు పడినట్లుగా తెలుస్తోంది.

**ఉన్నతాధికారులకూ భాగస్వామ్యం..!**

ఎక్సైజ్ అధికారులు దాడుల సమయంలో పట్టుబడిన మద్యం నిల్వలపై ఉన్నతాధికారులకు రిపోర్ట్ చేయాల్సి ఉంటుంది. మద్యం నగదు విలువ, బాటిళ్ల సంఖ్య, కంపెనీ పేర్లు, పాల్గొన్న సిబ్బంది వివరాలు, దాడి చేసిన సమయంలో, నిందితులకు సంబంధిచిన విరాలు, కేసు నమోదు వివరాలు వంటివి రిపోర్టులో ఉంటాయి. ఇలా సీజ్ చేసిన మద్యాన్ని కాలపరిమితిని అనుసరించి టెండర్ల ద్వారా మద్యం దుకాణాలకు విక్రయిస్తారు. ఆ మొత్తాన్ని ఎక్సైజ్ ఖాతాలో జమ చేస్తారు. అయితే నిబంధనలకు పాతరవేస్తున్న అధికారులు పట్టుకున్న మద్యంలో సగానికి మించి లెక్క చూపకుండానే కింది స్థాయి సిబ్బందితో మళ్లీ తమకు సన్నిహితంగా ఉండే బెల్ట్ షాపులకు, మద్యం దుకాణాలకు తరలింపు చేపడుతున్నట్లుగా తెలుస్తోంది. వాస్తవానికి ఈ దందాపై ఎస్‌హెచ్‌వోలు, జిల్లా స్థాయి అధికారుల వరకు ఓపెన్ సీక్రెట్‌గా కూడా డిపార్ట్‌మెంట్‌లో చర్చ జరుగుతుండటం గమనార్హం. ఈ అక్రమ వ్యవహారాన్ని చూసి చూడనట్లుగా వెళ్తున్నందుకు ఉన్నతాధికారులకు వాటాలు అందుతుండటమే చర్యల లేమికి కారణంగాత తెలుస్తోంది.



# విద్యార్థులకు గంజాయి విక్రయం.. ముఠా గుట్టు రట్టు

హైదరాబాద్: హైదరాబాద్‌లో గంజాయి స్మగ్లింగ్ ముఠా గుట్టును ఎస్ఓటీ బృందం రట్టు చేసింది. రాజేంద్రనగర్‌లో ఇద్దరు స్మగ్లర్ల నుంచి 30 కేజీల గంజాయినీ స్వాధీనం చేసుకొని సీజ్ చేసినట్లు ఎస్ఓటీ బృందం పేర్కొంది.

పట్టుబడి గంజాయి విలువ రూ. 11 లక్షలు ఉంటుందని తెలిపింది. గంజాయి స్మగ్లింగ్ జరుగుతోన్నట్లు తమకు సమాచారం అందడంతో.. ప్రత్యేక నిఘా పెట్టి తనిఖీలు నిర్వహించినట్లు వివరించింది. గంజాయి స్మగ్లర్లు పాతబస్తీ వాసులు మహ్మద్ అయాన్, మహ్మద్ మొయినుద్దీన్‌తోపాటు ఒడిశాకు చెందిన దీపక్‌లని తెలిపింది. అయితే వీరిలో ఇద్దరిని అరెస్ట్ చేశామని.. దీపక్ ప్రస్తుతం పరారీలో ఉన్నాడని.. అతడి కోసం గాలింపు చర్యలు చేపట్టినట్లు తెలిపింది. వీరిపై ఎన్‌డీపీఎస్ యాక్ట్ కింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు వివరించింది. గంజాయిని బ్రౌన్ కలర్ ప్యాకెట్స్‌లో ప్యాకింగ్ చేసి.. ఆటోలో దాచి స్మగ్లర్లు స్మగ్లింగ్ చేస్తున్నారని పేర్కొంది.



ఈ గంజాయిని భద్రాచలంలో దీపక్ కొనుగోలు చేసినట్లు ఎస్ఓటీ పోలీసులు తెలిపారు. ఈ గంజాయినీ చిన్న చిన్న ప్యాకెట్లుగా చేసి.. వాటిని విద్యార్థులకు విక్రయిస్తున్నట్లు తమ దర్యాప్తులో తెలిందని తెలిపింది. స్మగర్లు తరలిస్తున్న ఆటోతోపాటు ఓ బైక్‌ను సైతం సీజ్ చేసినట్లు ఎస్ఓటీ పోలీసులు వివరించారు.

# మైక్రోసాఫ్ట్ విండోస్ కొత్త బాస్.. పవన్ దావులూరి

హైదరాబాద్: మైక్రోసాఫ్ట్‌కు చెందిన ఆపరేటింగ్ సిస్టమ్ విండోస్, సర్ఫేస్ విభాగాలకు కొత్త బాస్‌గా పవన్ దావులూరి ని ఆ కంపెనీ నియమించింది. ఈ విభాగానికి నాయకత్వం వహించిన పనోస్ పనయ్ గతేడాది అమెజాన్‌లో చేరడంతో ఆయన స్థానంలో పవన్‌కు నూతన బాధ్యతలు అప్పగించారు. సాదారణంగా విండోస్, సర్ఫేస్ విభాగాలకు వేర్వేరుగా అధిపతులు ఉండేవారు. తాజాగా పవన్‌కే రెండింటి బాధ్యతలనూ మైక్రోసాఫ్ట్ అప్పగించింది. ఐఐటీ మద్రాసు పూర్వ విద్యార్థి అయిన పవన్ మైక్రోసాఫ్ట్‌లో 2001లో చేరారు. దాదాపు మూడేండ్లుగా కంపెనీలో కార్పొరేట్ వైస్ ప్రెసిడెంట్‌గా విధులు నిర్వర్తిస్తున్నారు. ఇటీవలే మైక్రోసాఫ్ట్‌లో డీప్‌మైండ్ విభాగం మాజీ సహ వ్యవస్థాపకుడు ముస్తఫా సులేమాన్‌ను ఏఐ బ్రాంచ్ అధిపతిగా ప్రకటించింది. ఆ తర్వాత పవన్‌కు కీలక బాధ్యతలు అప్పగించింది. తాజా నియామకంతో ఆయన




అమెరికా టెక్ కంపెనీల్లో అత్యున్నత పదవులు చేపట్టిన భారతీయుల జాబితాలో చోటు దక్కించుకున్నారు.

# జులై నుంచి హెల్త్ ప్రొఫైల్ కార్డులు

**- ఆధార్, నెంబర్ ఆధారంగా నమోదు**

**- శుభవార్త చెప్పిన ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి శ్రీదర్ బాబు**

మల్హర్ రావు: హోలీ పండుగ వేళా రాష్ట్ర ప్రజలకు కాంగ్రెస్ ప్రభుత్వం గుడ్ న్యూస్ చెప్పింది. రాష్ట్ర ప్రజలందరికీ జులై నుంచి హెల్త్ ప్రొఫైల్ కార్డులు అందజేయునట్లుగా తెలంగాణ రాష్ట్ర ఐటి, పరిశ్రమల, శాసనసభ వ్యవహారాల మంత్రి దుద్దిళ్ల శ్రీదర్ బాబు తెలిపారు.

హైదరాబాద్ ఆర్టీసీ కళా భవన్ లో మంథని వైదిక సంస్థ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో మంత్రి దుద్దిళ్ల హాజరై మాట్లాడారు ప్రజా సంక్షేమం, అభివృద్ధికి పాటుపడి ఎలాంటి భేషజాలకు పోకుండా ప్రజలు గర్వపడేలా కృషి చేస్తామన్నారు. ఆధార్ కార్డు సంఖ్య ఆధారంగా ప్రతి పౌరుడుకి స్మార్ట్ కార్డు వంటి హెల్త్ ప్రొఫైల్ సంఖ్యలో గుర్తింపు కల్పిస్తామన్నారు. హెల్త్ డేటా ఈజీగా ఉండేలా పెరు టైప్ చేసి సమగ్ర వైద్య సేవలు వివరాలు తెలుస్తాయన్నారు. ఏ వైద్యున్ని సంప్రదించిన వెంటనే వారి ఆరోగ్య స్థితిగతులను తెలుసుకొని మెరుగైన వైద్య సేవలు అందించేందుకు ఇది దోహద పడుతుందన్నారు. కాగా తన తండ్రి



శ్రీపాదరావు మరణాంతరం సోనియాగాంధీ తనను పార్టీలోకి ఆహ్వానించారని తెలిపారు. తన తల్లి జయశ్రీ ప్రోత్సాహంతోనే రాజకీయాల్లోకి వచ్చనన్నారు.

తన 25 ఏళ్ల రాజకీయ ప్రస్థానంలో 5సార్లు ఎమ్మెల్యేగా, మంత్రిగా రాష్ట్ర ప్రజలకు అందుబాటులో ఉండి రాజకీయాలకు అతీతంగా సేవలందించనన్నారు. కాంగ్రెస్ పార్టీలో సేవలందించాలంటే ఎంతో ఓపిక ఉండాలన్నారు. మంథని ప్రజలకు ఎల్లవేళలా అండగా ఉంటానని హామి ఇచ్చారు.

# వరద కాలువ నీటి విడుదల అడ్డుకున్న రైతులు

**- నాగపూర్ క్రాస్ రెగ్యులేటరీ వద్ద ఉద్రిక్తత**

**- అధికారులతో వాగ్వాదానికి దిగిన రైతులు**

కమ్మర్ పల్లి: మండలంలోని నాగపూర్ క్రాస్ రెగ్యులేటరీ నుండి దిగువకు నీటి విడుదల చేయాలని అధికారులు చేసిన ప్రయత్నాన్ని సోమవారం రైతులు అడ్డుకున్నారు. వరద కాలువ 27.850 కిలోమీటర్ పాయింట్ వద్ద ఉన్న క్రాస్ రెగ్యులేటర్ నుండి దిగువకు నీటిని విడుదల చేయాలని నీటిపారుదల శాఖ ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు డిఈ గణేష్, వేయి రామారావు క్రాస్ రెగ్యులేటర్ వద్దకు వచ్చారు. ప్రస్తుతం వరద కాలువలో ఉన్న నీటిని గేట్లు ఎత్తి దిగువకు విడుదల చేయడానికి ప్రయత్నాలు చేస్తుండగా విషయం తెలుసుకున్న కమ్మర్ పల్లి, నాగపూర్, మోర్తాడ్ మండలం తిమ్మాపూర్ గ్రామాల రైతులు క్రాస్ రెగ్యులేటర్ వద్దకు చేరుకొని అధికారులతో వాగ్వాదానికి దిగారు. వరద కాలువలోని నీటిని దిగువకు వదిలితే తమ పంటల పరిస్థితి ఏమిటని అధికారులను రైతులు నిలదీశారు. ప్రస్తుతం వరి పంట పొట్ట దశకు చేరుకుందని, ఎండలు ఎక్కువయ్యాయని, భూగర్భ జలాలు అడుగంటి బోర్లు పోయడం లేదని అధికారుల దృష్టికి తీసుకు పోయారు.

ఈ సమయంలో వరి పంటకు తడులు ఇవ్వకపోతే దిగుబడి మీద తీవ్ర ప్రభావం పడుతుందని, క్రాస్ రెగ్యులేటర్ గేట్లు ఎత్తేదే లేదని రైతులు పట్టుబట్టారు. ఈ విషయాన్ని డిఈ గణేష్ ఫోన్ ద్వారా ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్లారు. వెంటనే ఎస్ఈ శ్రీనివాస్, ఈఈ చక్రపాణి క్రాస్ వద్దకు చేరుకొని రైతులతో మాట్లాడారు. ఇప్పటికే వారం రోజుల కిందటే నీటి విడుదల ఒప్పుకున్నామని, అధికారులు నీటిని విడుదల కూడా చేశారని మళ్ళీ ఇప్పుడు నీళ్లు కావాలంటే ఎలా అని రైతులు అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. క్రాస్ రెగ్యులేటరీ నిర్మాణం నిబంధనల ప్రకారం తమ



చెందాల్సిన నీళ్ళు తమకే చెందాలని రైతులు స్పష్టం చేశారు. ఈ సందర్భంగా రైతులతో మాట్లాడిన ఎస్ఈ శ్రీనివాస్ వేములవాడ నియోజకవర్గంలోని ఐదు గ్రామాల రైతులు దిగువన నీటిమట్టం తక్కువ ఉండడంతో ఇబ్బందులు పడుతున్నారని వివరించారు. వరదాకాలో క్యాష్ రెగ్యులేటరీ వద్ద నీటిమట్టం నాలుగు మీటర్లు ఉందని, అందులో నుండి ఒక మీటర్ మట్టం నీటిని విడుదల చేస్తే ఐదు గ్రామాల రైతుల సమస్య కొంతైనా తీరుతుందన్నారు. తోటి రైతుల ఇబ్బందులను అర్థం చేసుకొని నీటి విడుదలకు రైతులు సహకరించాలని కోరారు. వరద కాలువలో క్రాసు రెగ్యులర్ నిర్మించినప్పుడు ఎవరి మాటలు వారికి ఉన్నాయని, తమ వాటల నుండి నీటిని తీసుకెళ్తే ఈ ప్రాంత రైతుల పరిస్థితి ఏంటని అధికారులను రైతులు నిలదీశారు. ఇలా అయితే క్రాస్ రెగ్యులేటర్ నిర్మాణం ఎందుకు చేపట్టారో అధికారులు చెప్పాలన్నారు. కొద్దిసేపు రైతులు, అధికారుల మధ్య తీవ్ర వాగ్వాదం చోటుచేసుకుంది. చివరకు రెండు అడుగుల మేరా క్రాస్ రెగ్యులేటరీ గేటు ఎత్తేందుకు రైతులు అంగీకరించారు. దీంతో ఊపిరి పీల్చుకున్న అధికారులు గేట్లెత్తి దిగువకు నీటి విడుదల చేశారు.

# ఎండిన పంట ప్రతి ఎకరాకు రూ. 25 వేలు నష్ట పరిహారం అందించాలి

**- మాజీ ఎమ్మెల్యే సుంకె రవిశంకర్ డిమాండ్**

గంగాధర: నీరు అందక ఎండిన పంట ప్రతి ఎకరానికి రూ. 25 వేల చొప్పున రైతులకు నష్టపరిహారం చెల్లించాలని మాజీ ఎమ్మెల్యే సుంకె రవిశంకర్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గంగాధర మండలం మల్లాపూర్ గ్రామానికి చెందిన ఆకుల రాజయ్య అనే రైతు తనకున్న 4 ఎకరాల భూమిలో వరి పొలం సాగు చేయగా, నీరందక పంట ఎండిపోగా మాజీ ఎమ్మెల్యే సుంకె రవిశంకర్ రైతులు, బీఆర్ఎస్ నాయకులతో కలిసి పొలాన్ని సందర్శించి పరిశీలించారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే రవిశంకర్ మాట్లాడుతూ బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో 365 రోజులు జీవనదిలా వరద కాలువలో నీరు ప్రవహించిందని, వేల ఎకరాలు సాగులోకి వచ్చాయని అన్నారు. పాడి పంటలతో అలరారిన వరద కాల్వ పరివాహక, కరువు ప్రాంతాలు కాంగ్రెస్ ప్రభుత్వం మళ్లీ అధికారంలోకి రాగానే నీరు లేకుండా పోయి కరువు ఛాయలు కమ్ముకుని రైతులు, ప్రజలకు కష్టాలు మొదలైయ్యా యని అన్నారు. పంట పొలాలు ఎండిపోయి రైతులు కన్నీరు కారు స్తుంటే ప్రభుత్వం పట్టనట్టు వ్యవహరిస్తుందని విమర్శిం చారు. పొట్ట దశలో



ఉన్న వరి పొలాలకు నీరందించి ప్రభుత్వం కాపాడాలని, ఎండిన పంట పొలాలకు ఎకరాకు రూ. 25 వేల నష్టపరిహారం ప్రకటించాలని ఆయన డిమాండ్ చేశారు. మాజీ ఎమ్మెల్యే వెంట గంగాధర సింగిల్ విండో చైర్మన్ దూలం బాలాగౌడ్, యాదవ మహాసభ జిల్లా అధ్యక్షుడు నాగరపు సత్యనారాయణ, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు మేచినేని నవీన్ రావు, మాజీ సర్పంచులు ఆకుల శంకరయ్య, మల్లేశం, బీఆర్ఎస్ నాయకులు తూము మల్లారెడ్డి, రైతులు పాల్గొన్నారు.

# కామ్రేడ్స్‌లో కన్‌ఫ్యూజన్?!.. లోక్‌సభ ఎన్నికల్లో పొడవని పొత్తులు, మద్దతుపై మీనమేషాలు


ఖమ్మం: రాష్ట్రంలో కమ్యూనిస్టు పార్టీలు కన్‌ఫ్యూజన్‌లో ఉన్నాయి. ఎన్నికల షెడ్యూల్ విడుదలై రాజకీయ పార్టీలు అభ్యర్థులను ప్రకటిస్తున్నా..

సీపీఎం, సీపీఐలు ఇంకా మీనమేషాలు లెక్కిస్తున్నాయి. రాబోయే పార్లమెంట్ ఎన్నికల్లో ఒంటరిగా బరిలోకి దిగాలా ? లేక ఇతర రాజకీయ పార్టీలతో జట్టు కట్టాలా ? అనే అంశంపై తర్జన భర్జన పడుతున్నాయి. మతోన్మాద శక్తులను ఓడించాలన్న ఏకైక ధ్యేయంతో ముందుకెళ్లే కమ్యూనిస్టుపార్టీలు తీసుకునే నిర్ణయంపైనే ఇప్పుడు రాజకీయపరమైన చర్చ నడుస్తున్నది.

ఇప్పటివరకు లౌకికవాద పార్టీలతో జట్టు కట్టిన సీపీఐ, సీపీఎం లు సందర్భాను సారంగా కొన్నిసార్లు కలిసి, మరికొన్ని సార్లు వేర్వేరుగా లౌకికవాద పార్టీలకు స్నేహహస్తం అందించాయి. శాసనసభ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీతో జతకట్టిన సీపీఐ.. పొత్తులో భాగంగా కొత్తగూడెంను సాధించుకున్నది. సీపీఎం కూడా కాంగ్రెస్ పార్టీతో జట్టు కట్టాలని పావులు కదిపినా ఫలించలేదు. వైరా, మిర్యాలగూడ అసెంబ్లీ స్థానాలను ఆశించిన సీపీఎం డిమాండ్లను కాంగ్రెస్ పార్టీ పట్టించుకోలేదు. దీంతో అసెంబ్లీ ఎన్నికల్లో తనకు పట్టున్న స్థానాల్లో ఒంటరిగా బరిలోకి దిగిన సీపీఎం ఒక్క స్థానాన్ని కూడా గెలుచుకోలేదు.

**పార్లమెంట్‌పై పట్టువిడుపులు**

ప్రస్తుతం పార్లమెంట్ ఎన్నికల షెడ్యూలు విడుదలైన నేపథ్యంలో వామపక్ష పార్టీలు ఇంకా పట్టువిడుపులపైనే ఉన్నాయి. అసెంబ్లీ ఎన్నికల్లోలాగే పార్లమెంట్ ఎన్నికల్లోనూ కాంగ్రెస్‌కు సీపీఐ స్నేహహస్తం అందించేందుకు ప్రయత్నాలు ప్రారంభించింది. తమకు వరంగల్ లేదా కరీంనగర్ లోక్‌సభ స్థానాన్ని కేటాయించాలని కోరినట్లు తెలుస్తున్నది. కానీ ఇప్పటికే వరంగల్




లోక్‌సభకు అభ్యర్థిని ప్రకటించిన కాంగ్రెస్ పార్టీ పెద్దల నుంచి ఎటువంటి ప్రతిస్పందన రాలేదు. పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్, సీపీఐ మధ్య పొత్తు పొడుస్తుందా ? లేదా ? అనేది కొంత కాలం గడిస్తే కానీ చెప్పే పరిస్థితులు కనిపించుట లేదు.

సీపీఐ కూడా కాంగ్రెస్‌తో కలిసి నడువాలా ? లేక ఒంటరిగా బరిలోకి దిగాలా ? అనే సందిగ్ధంలో ఉన్నట్టు సమాచారం. గతంలో బీఆర్ఎస్‌కు మిత్రపక్షంగా వ్యవహరించిన సీపీఎం పట్టున్న స్థానాల్లో ఒంటరిగా బరిలోకి దిగుతుందా ? అని రాజకీయ వర్గాలో చర్చ నడుస్తున్నది. ప్రస్తుత పరిణామాల నేపథ్యంలో ఆ పార్టీ బీఆర్ఎస్ వైపు మొగ్గు చూపుతుందా..? లేదా కాంగ్రెస్ పార్టీ వైపు వెళుందా..? అనే విషయంపై పార్టీ నేతలు చర్చించుకుని త్వరలో స్పష్టత ఇస్తారని తెలుస్తున్నది. లోక్‌సభ ఎన్నికలకు ఇంకా రెండు నెలల సమయం ఉంది. రెండు పార్టీల పయనంపై ఇకనైనా స్పష్టత వస్తుందేమో చూడాలి.

# రంజాన్ లో సేవ చేయడం లోనే తృప్తి..

**- కులం మతం అడ్డు కాదు..**

**- హైవే సెక్షన్ అధికారి సుబ్బారావు..**


డిచ్ పల్లి: తల్లి చూపిన మార్గంలోనే తనయుడు ప్రయాణిస్తున్నారు ప్రతి ఏటా రంజాన్ మాసం లో ముస్లిం నిరుపేదలకు తమ వంతుగా నిత్యవసర వస్తువులను అందజేయడం తోనే తమకు ఏడాదంతా తృప్తి కలుగుతుందని ఇందల్ వాయి హైవే ఫారెస్ట్ సెక్షన్ అధికారి ఎం సుబ్బారావు అన్నారు. మంగళవారం డిచ్ పల్లి మండలం లోని కమలాపూర్ ఫారెస్ట్ సెంట్రల్ నర్సరీలో ఉపాధి పని చేసే 13 మంది ముస్లిం కుటుంబాలకు రంజాన్ పండుగను పురస్కరించుకొని నిత్యవసర వస్తువులను అందజేశారు. ఈ సందర్భంగా సెక్షన్ అధికారి ఎం సుబ్బారావు మాట్లాడుతూ గతకనేళ్లుగా రంజాన్ మాసంలో సుబ్బారావు తల్లి ఎం సరోజా ముస్లిం నిరుపేదలకు నిత్యాసర సరుకులను పంపిణీ చేస్తూ ఉండేవారు. దానిలో భాగంగానే తల్లి చూపిన మార్గంలో తనయుడు ప్రయాణిస్తూ తన వంతు సహకారంగా రంజాన్ పండుగకు అవసరమయ్యే బియ్యం, కారం, నూనె, సేమియాలు, డ్రై ఫ్రూట్స్ తోపాటు తదితర వస్తువులను అందజేశారు. వాస్తవానికి ఏం సుబ్బారావు బ్రహ్మన కులస్తులు. నేటి రోజుల్లో దేశంలో హిందూ, ముస్లింలు కులాల మధ్య కొందరు చిచ్చు పెట్టి లేని గొడవలు సృష్టిస్తు అయోమయానికి




గురి చేస్తున్నారు. ఇలాంటి తరుణంలో కులాలకు మతాలకు అతీతంగా తమ వంతుగా నీరుపేద లను సహాయ సహకారాలు అందజేస్తున్నారు. ఎవరు ఏమైనా తమ కేమి అంటూ ఒకరికి అండగా ఉంటు వాటన్నింటినీ కాదని తల్లి అడుగుజాడల్లో తనయుడు ఎం సుబ్బారావు నడుచుకుంటూ కొనేళ్ల నుండి నడుస్తున్న సంప్రదాయాన్ని కొనసాగిం చమే కాకుండా రాబోవు రోజుల్లో కూడా తమవంతుగా సహకారాన్ని అందించాడం అభినందనమని తోటి యానంపల్లి సెక్షన్ అధికారి బాపురావు అన్నారు.

# హెచ్ఐవీ ఇక పరారే, కొత్త టెక్నాలజీ..!

**హెచ్ఐవీ నివారణలో కీలక పురోగతి CRISPR జీన్ ఎడిటింగ్ ?ప్రక్రియ కణాల నుండి HIV ని తొలగిస్తుంది: శాస్త్రవేత్తలు ఎన్నో ఏళ్లుగా ప్రపంచాన్ని వణికిస్తున్న ప్రాణాంతక వ్యాధి హ్యూమన్ ఇమ్యునో డెఫిషియెన్సీ వైరస్ .**



తాజాగా ఈ మహమ్మారి నివారణ విషయంలో గుడ్ న్యూస్ అందింది. ఇకపై హెచ్ఐవీని పూర్తిగా నయం చేయవచ్చని శాస్త్రవేత్తలు అంచనా వేస్తున్నారు. ప్రస్తుతం మందులు తప్ప నివారణ లేని హైఐవీ వ్యాధిని నయం చేయడానికి కొత్త మార్గాన్ని గుర్తించారు.

డచ్ శాస్త్రవేత్తల బృందం పరిశోధన వచ్చే నెలలో యూరోపియన్ కాంగ్రెస్ ఆఫ్ క్లినికల్ మైక్రోబయాలజీ అండ్ ఇన్ఫెక్షియస్ డిసీజెస్‌లో ఈ పరిశోధనను వెల్లడించే అవకాశం ఉంది. ప్రస్తుతంఉపయోగించే మందులు వైరస్ దాడిని ఆపగలవు కానీ పూర్తిగా నివారించలేవు దీనిపై ప్రపంచవ్యాప్తంగా అనేక పరిశోధనలు జరుగుతూనే ఉన్నాయి. తాజాగా శాస్త్రవేత్తలు కీలక పురోగతిని సాధించారు. బీబీసీ నివేదిక ప్రకారం ఆమ్‌స్టర్‌డ్యామ్ విశ్వవిద్యాలయానికి చెందిన పరిశోధకుల బృందం, నోబెల్ బహుమతి పొందిన క్రిస్పర్ జీన్-ఎడిటింగ్ టెక్నాలజీ సాయంతో హెచ్ఐవీని విజయవంతంగా తొలగించినట్లు చెప్పారు.

మాలిక్యులర్ కటింగ్ అని పిలిచే ఈ పద్ధతి ద్వారా శాస్త్రవేత్తలు హెచ్ఐవీ సోకిన కణాల డీఎన్ఏను తొలగించగలిగారు. తొలుత ఈ టెక్నాలజీ సూక్ష్మ స్థాయిలో కత్తెరలా పనిచేసి "చెడు" భాగాన్ని తొలగిస్తుంది. ఆ తరువాత శరీరాన్ని పూర్తిగా వైరస్ నుండి విముక్తి చేయగలదని పరిశోధకులు ఆశిస్తున్నారు. అయితే ఈ CRISPR సాంకేతికత ఎంత సురక్షితంగా, ఎంత ప్రభావవంతంగా ఉంటుందో తెలియడానికి మరింత పరిశోధన జరగాల్సి ఉందని నాటింగ్‌హామ్ విశ్వ విద్యాలయంలో స్టెమ్ సెల్, జీన్ థెరపీ టెక్నాలజీ అసోసియేట్ ప్రొఫెసర్ డా. జేమ్స్ డిక్సన్ తెలిపారు.

క్రిస్పర్-ఆధారిత చికిత్సలో చాలా సవాళ్లు ఉన్నాయనీ, ఇది అందుబాటులోకి రావడానికి చాలా సంవత్సరాలు పట్టవచ్చు అన్నారు లండన్‌లోని ఫ్రాన్సిస్ క్రిక్ ఇన్‌స్టిట్యూట్‌లోని వైరస్ నిపుణుడు డా. జోనాథన్ స్టోయ్,

హెచ్ఐవికి చికిత్స చేయడం చాలా కష్టం ఎందుకంటే ఇది రెట్రోవైరస్. ఇది వ్యక్తి రోగనిరోధక శక్తిని బలహీనపరిచే ఒక తీవ్రమైన అంటు వ్యాధి. జీవితకాల యాంటీరెట్రోవైరల్ థెరపీ అవసరమవుతుంది. ఈ మందులను నిలిపి వేస్తే డీఎన్ఏలో దాక్కున్న వైరస్ తిరిగి విజృంభిస్తుంది. ప్రాణాంతకం కూడా.

# ఈ సూపర్ ఫుడ్స్‌తో మెరిసే చర్మం సొంతం

కాంతులీనే చర్మం కోసం పలువురు రకరకాల చర్మ సంరక్షణ ఉత్పత్తులను వాడుతూ ప్రయోగాలు చేస్తుంటారు. చర్మ సౌందర్యాన్ని సహజ సిద్ధంగా పెంపొందించి చర్మ నిగారింపులో కీలకంగా పనిచేసే ఆహార పదార్థాలను మాత్రం నిర్లక్ష్యం చేస్తుంటారు.

యూఎస్ నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ హెల్త్ 2020 పరిశోధనా కథనంలో ప్రస్తావించిన వివరాల ప్రకారం పోషకాహారానికి చర్మ ఆరోగ్యంతో సంబంధం ఉందని వెల్లడైంది.

దెబ్బతిన్న చర్మాన్ని పోషకాహారం, మన ఆహారపు అలవాట్లతో చక్కదిద్దవచ్చని పోషకాహార నిపుణులతో పాటు డెర్మటాలజిస్టులూ చెబుతున్నారు. మీ చర్మ ఆరోగ్యాన్ని మెరుగుపరుచుకోవాలంటే ఐదు భారతీయ సూపర్ ఫుడ్స్‌ను ఎంచుకోవాలని ఎండీ, డెర్మటాలజిస్ట్ డాక్టర్ జుష్య భాటియా సరిన్ ఇన్‌స్టాగ్రాంలో షేర్ చేశారు. నట్స్ నుంచి కూరగాయాలు, మసాలా దినుసులు, తృణధాన్యాల వంటివి వివిధ రెసిపీల్లో వాడితే చర్మ సంరక్షణ, చర్మ ఆరోగ్యం మెరుగవుతుందని చెబుతున్నారు.



టమాటాలు చర్మ సౌందర్యానికి అద్భుతంగా పనిచేస్తాయని ఆమె చెబుతున్నారు. ఇందులో ఉండే లైకోపీన్ అనే యాంటీ ఏజింగ్, యాంటీఆక్సిడెంట్స్ చర్మానికి మేలు చేస్తాయి. టమాటా సూప్స్, టమాటా కర్రీ వంటి వండిన టమాటా డిష్‌లను అధికంగా తీసుకోవాలని ఇన్‌స్టాగ్రాం రీల్‌లో ఆమె వివరించారు. ఇంకా రెడ్ క్యారెట్స్, వాటర్ మెలన్స్, పపాయాల వంటివి కూడా చర్మ సంరక్షణకు ఉపయోగపడతాయని తెలిపారు.

# చుక్కేసి.. ముక్కకోసం గొడవ.. పెళ్లిలో ఇరువర్గాలు ఘర్షణ..!

వివాహ వేడుకలో వింత ఘటన చోటుచేసుకుంది. ముక్క కోసం ఇరువర్గాలు దాడి చేసుకోవడంతో తీవ్ర గాయాలయ్యాయి. పోలీసులకు ఈవార్త చేరడంతో.. రంగంలోకి దిగిన పోలీసులు 16 మందిపై కేసు నమోదు చేశారు. పెళ్లి విందు వివాదాస్పదంగా మారిన ఘటన జగిత్యాల జిల్లా మెట్‌పల్లి మండలం ఆత్మకూరులో చోటుచేసుకుంది.

వేములవాడకు చెందిన అబ్బాయితో ఆత్మకూరుకు చెందిన ఓ యువతికి పెళ్లి ఫిక్స్ అయ్యింది. పెళ్లికూతురు ఇంట్లోనే అంగరంగ వైభవంగా వివాహం కూడా జరిగింది. పెళ్లికి హాజరైన వధువు బంధువులు, స్నేహితులందరికీ వధువు కుటుంబ సభ్యులు విందు ఏర్పాటు చేశారు. మటన్ కర్రీ, బగారా రైస్ అతిథులకు వడ్డించడం వల్ల మర్యాదకు లోటు రాకుండా చేశారు. అయితే మద్యం మత్తులో కొందరు చేసిన గొడవ ఘర్షణకు దారితీసింది. మద్యం మత్తులో భోజనానికి వచ్చిన పెళ్లికొడుకు బంధువులకు భోజనానికి సరిపడా మటన్ కూర అయిపోయిందని వధువు బంధువులు చెప్పడంతో మద్యం మత్తులో వరుడి బంధువులు గొడవకు దిగారు. వంట సామాగ్రి, టేబుళ్లను ఎత్తుకెళ్లి వడ్డిస్తున్న వారిపై దాడి చేశారు.

దీంతో వధూవరుల బంధువులు పరస్పరం గొడవపడగా, వధువు బంధువుల్లో ఇద్దరికి గాయాలయ్యాయి. పెళ్లి వేడుక రణరంగంగా మారింది. క్షతగాత్రులను ఆస్పత్రికి తరలించి మూడంచెల బంధంతో ఏడడుగులు వేసిన నవ వధువును వేములవాడకు పంపించారు.



విందులో ఇరువర్గాలు ఘర్షణ పడడంతో మెట్ పల్లి పోలీసులు 16 మందిపై కేసు నమోదు చేశారు. బాలిక బంధువు దుద్దుల తిరుపతి ఫిర్యాదు మేరకు వేములవాడకు చెందిన బాలుడి బంధువులు ఏడుగురిపై, ఆత్మకూరుకు చెందిన బాలిక బంధువులు 9 మంది, వేములవాడకు చెందిన బాలుడి బంధువు నరవరాజుపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ చిరంజీవి తెలిపారు. మద్యం మత్తులో గొడవపడి ఒకరినొకరు కొట్టుకుని కటకాలు లెక్కపెట్టే పరిస్థితి తలెత్తడంతో వధూవరుల తల్లిదండ్రులు రాజీ పనుల్లో నిమగ్నమయ్యారు. కాగా.. మొత్తానికి మద్యం మత్తులో మటన్ కోసం కొట్లాటకు దిగి గాయపడి.. పోలీస్ స్టేషన్ ముందు పడిగాపులు పడాల్సి వచ్చింది.

# చింతగింజల మ్యాజిక్ తెలుసా?

చింత గింజలు అంటే చింతపండు వాడుకుని, పులుసు తీసుకున్న తరువాత తీసిపారేసే వేస్ట్ గింజలనుకునేరు. వీటి వల్ల అనేక ఆరోగ్య ప్రయోజనాలు ఉన్నాయి. చింతపండు గింజల్లో ఉండే ప్రోటీన్‌లోయాంటీవైరల్ లక్షణాలు ఉన్నాయని, చికున్ గున్యా కోసం యాంటీవైరల్ మందులను అభివృద్ధి చేయడానికి సమర్థ వంతంగా ఉపయోగించవచ్చని నిపుణుల మాట. దీంతో పాటు వివిధ ప్రయోజనాలూ ఉన్నాయి. అవేంటో తెలియాంటే.. ఈ కథనాన్ని చదవాల్సిందే..!

చింత చెట్టును భారత దేశపు ఖర్జూర చెట్టు అంటారు. గతంలోనే ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ బయోటెక్నాలజీ విభాగానికి చెందిన రూర్కీ ప్రొఫెసర్‌లు చింతగింజలపై పరిశోధనలు చేశారు. ఈ పరిశోధనలు ఎల్సెవియర్ జర్నల్, వైరాలజీలో ప్రచురించబడ్డాయి కూడా. దీని ప్రకారం మధుమేహ నిర్వహణలో ఉపయోగ పడతాయి. చింత గింజల పొడితో దంత సమస్యలను దూరం చేసుకోవచ్చు. కీళ్ల నొప్పులతో బాధపడేవారికి చింతగింజలు దివ్యౌషధంగా పనిచేస్తాయని ఆరోగ్య నిపుణులు చెబుతున్నారు.

మధుమేహం: చింతపండు గింజలు ప్యాంక్రియాస్‌ను రక్షిస్తాయి. ఇన్సులిన్ ఉత్పత్తి చేసే కణాల పరిమాణాన్ని పెంచుతుంది. చింతపండు గింజల నీటిని తాగడం వల్ల రక్తంలో చక్కెర స్థాయిలను సహజంగా నియంత్రించుకోవచ్చు.

దంతాలకు మేలు చేస్తుంది: చింతపండు గింజల పొడితో చిగుళ్ళు ,దంతాలను తోముకుంటే మంచిది. ఎక్కువగా పొగ త్రాగే వారికి. శీతల పానీయాలు, ధూమపానం వల్ల పళ్లు గారపట్టిపోతాయి. ఇందుకోసం చింత గింజలను పొడి చేసి అందులో నీళ్లు కలిపి పేస్ట్‌లా చేసి రోజూ దంతాలను తోముకోవాలి. దీంతో దంతాలు తెల్లగా మారడంతోపాటు దంతాలపై ఉండే గార, పాచి వదిలిపోతుంది.

జీర్ణక్రియ: చింతపండు గింజల రసం అజీర్ణాన్ని నయం చేయడానికి, పిత్తానికి సహజ నివారణగా ప్రసిద్ధి చెందింది. అంతేకాకుండా, ఇందులో



డైటరీ ఫైబర్ పుష్కలంగా ఉంటుంది. ఇది కొలెస్ట్రాల్‌ను మరింత తగ్గిస్తుంది.

ఇన్ఫెక్షన్లను నివారణలో: యాంటీ బాక్టీరియల్ లక్షణాలుతో చర్మాన్ని ఇన్ఫెక్షన్ల నుండి రక్షించుకోవచ్చు. అంతేకాకుండా, ఇది పేగు , మూత్ర నాళాల ఇన్ఫెక్షన్ల నుండి కూడా కాపాడుతుంది.

గుండెకూ మంచిదే: చింతపండు విత్తనాలలో పొటాషియం ఉంటుంది. పొటాషియం బీపీని తగ్గిస్తుంది. రక్తపోటు, ఇతర హృదయ సంబంధ వ్యాధులతో బాధపడుతున్న రోగులకు ఉపయోగపడుతుంది.

ఇన్ఫెక్షన్ల నివారణలో: చింత గింజల్లో యాంటీ వైరల్ గుణాలు పుష్కలంగా ఉంటాయి. అందువల్ల ఈ గింజల పొడిలో నీళ్లు కలిపి ఆ మిశ్రమాన్ని గాయాలు, పుండ్లపై రాసుకోవచ్చు. అలాగే మంగు మచ్చల నుంచి ఉపశమనం కలిగిస్తాయి. చింత గింజలను పొడిలా తయారుచేసి, ఆ పొడిలో తేనె కలిపి మచ్చల ప్రభావిత ప్రాంతంలో అప్లై చేయడం వల్ల మంచి ఫలితాలు ఉంటాయి. చింతగింజల పొడిని రోజూ ఓ అర టీస్పూన్ మేర రోజుకు రెండు సార్లు నీటితో కలిపి తీసుకోవాలి. పాలు లేదా నెయ్యిని కూడా వాడొచ్చు. దీనివల్ల మోకాళ్ల నొప్పులు దూరమవుతాయి.

# కిడ్నీ వ్యాధులను ముందుగానే ఎలా గుర్తించాలి?

మన శరీరంలోని మలినాలను ఎప్పటికప్పుడు తొలగిస్తూ, శరీరం ఎప్పుడూ పరిశుభ్రంగా, ఆరోగ్యంగా ఉండడానికి మూత్రపిండాలు దోహదపడతాయి. ఇవి రోజుకు దాదాపు 200 లీటర్ల రక్తాన్ని శుద్ధి చేస్తాయి. వాటి పనితీరు ఆధారంగా మిగతా శరీర భాగాలు సమతుల్యం చెంది సమర్థవంతంగా పనిచేసి శరీరానికి రక్షణ కల్పిస్తాయి. ప్రస్తుత కాలంలో అత్యాధునిక వైద్య పద్ధతులు ఎన్ని వచ్చినా ఆందోళన కలిగించే అసంక్రామ్యత దీర్ఘకాల వ్యాధుల జాబితాలో కిడ్నీ సమస్య ఒకటి ప్రపంచవ్యాప్తంగా వేధిస్తోంది. కిడ్నీ వ్యాధులకు అనేక కారణాలు ఉన్నా.. ప్రధానంగా జీవన విధానంలో మార్పులు, పెయిన్ కిల్లర్స్ ఎక్కువగా వాడటం, హై బీపీ, షుగర్, గాలి, నీటి కాలుష్యం ప్రధానమైనవి. అదేవిధంగా శరీరంలో వేరే అవయవాల పనితీరు దెబ్బతిన్నప్పుడు కూడా ఆ ప్రభావం కిడ్నీ మీద పడి కిడ్నీ వైఫల్యానికి కూడా దారితీస్తుంది. దేశంలో ఏటా రెండు లక్షల మంది కొత్తగా కిడ్నీ వ్యాధుల బారిన పడుతున్నట్లు అంచనా. మన దేశంలో 10 కోట్ల మంది కిడ్నీ బాధితులున్నారు. ప్రపంచవ్యాప్తంగా 850 మిలియన్ల మంది ఈ వ్యాధితో బాధపడుతున్నట్లు వైద్య ఆరోగ్య గణాంకాలు చెబుతున్నాయి. ఏటా దీర్ఘకాల కిడ్నీ వ్యాధులతో 2.4 మిలియన్ల మంది చనిపోతున్నట్టు అంచనా. ప్రతి పది మందిలో ఒకరు కిడ్నీ వ్యాధిగ్రస్థులుగా ఉన్నారు. రోజు రోజుకు ప్రపంచవ్యాప్తంగా దీర్ఘకాలిక కిడ్నీ సమస్యలు (క్రానిక్ కిడ్నీ డిసీజ్) వేధిస్తున్న నేపథ్యంలో 2040 నాటికి ప్రపంచ మరణాలలో ఐదో స్థానాన్ని కిడ్నీ సంబంధిత వ్యాధులే ఆక్రమిస్తున్నాయని ప్రపంచ ఆరోగ్య అధ్యయనాలు పేర్కొంటున్నాయి. మన దేశంలో ప్రత్యేకించి గ్రామీణ ప్రాంతాల్లో స్పష్టమైన కారణమేది లేకుండా కిడ్నీలు దెబ్బతినడం చూస్తున్నాం. పర్యావరణంలోని విషతుల్యాలు, భార లోహాల ప్రభావం, ఒంట్లో నీటి శాతం తగ్గటం వంటివి ఇందుకు దోహదం చేస్తుండొచ్చని భావిస్తున్నారు. అలాగే గాలి కాలుష్యం ప్రమాదకరంగా పరిణమిస్తోంది. గాలి కాలుష్యానికి దీర్ఘకాల కిడ్నీ జబ్బులకు సంబంధం ఉంటున్నట్టు కొన్ని అధ్యయనాలు చెబుతున్నాయి. అధిక వేడి మూలంగానూ, ముఖ్యంగా తగినంత నీరు తాగకపోతే కిడ్నీలు దెబ్బతినే అవకాశం ఉంది. ఇటీవల సైలెంట్ కిల్లర్‌గా కిడ్నీ రోగుల సంఖ్య పెరుగుతున్నందు వల్ల అంతర్జాతీయంగా వైద్య విభాగం అప్రమత్తమై "అందరికీ కిడ్నీహెల్త్" పేరిట ప్రజల్లో అవగాహనకు నడుం బిగించింది. పలు నెఫ్రాలజీ సొసైటీలు "వరల్డ్ కిడ్నీ డే" సందర్భంగా ప్రజల్లో అవగాహన కల్పించేందుకు ఏటా మార్చి రెండో గురువారం వరల్డ్ కిడ్నీ డే గా నిర్వహిస్తున్నారు. ఈ నేపథ్యంలో కిడ్నీ వ్యాధులను ఎలా నిర్ధారించాలి? వాటి లక్షణాలు ఏంటి? ఎలాంటి చికిత్సలు అందుబాటులో ఉన్నాయనే వివరాలను హైదరాబాద్ కొంపల్లిలోని రెనోవా హాస్పిటల్స్ కన్సల్టెంట్ నెఫ్రాలజిస్ట్ డాక్టర్ అర్చన దఫ్తార్దార్ వివరించారు.

# హెయిర్ ట్రాన్స్‌ప్లాంటేషన్ ఎందుకంటే..

చాలామంది దృష్టిలో హెయిర్ ట్రాన్స్‌ప్లాంటేషన్ అంటే కేవలం మళ్లీ జుట్టు పెరిగేలా చేసుకోవడమే! నిజానికి ఈ పద్ధతి వల్ల మరెన్నో ఉపయోగాలు ఉన్నాయంటున్నారు నిపుణులు.


బట్టతలకు జన్యులోపం ఓ ముఖ్యకారణం. డీహెచ్‌టీ (డై హైడ్రో టెస్టోస్టిరాన్) అనే ఓ హార్మోన్ వల్ల జుట్టు కుదుళ్లు కుదించుకుపోయి, క్రమంగా మూసుకుపోతాయి. ట్రాన్స్‌ప్లాంటేషన్ వల్ల, ఆ కుదుళ్లు మళ్లీ ఆరోగ్యంగా తయారవుతాయి.

ట్రాన్స్‌ప్లాంటేషన్ ఓ శాశ్వత పరిష్కారం. చికిత్స జరిగిన ప్రదేశంలో వెంటనే బట్టతల వచ్చే అవకాశం పెద్దగా ఉండదు.

నిపుణులైన సర్జన్స్ ట్రాన్స్‌ప్లాంట్ చేసినప్పుడు తలకట్టు ఆకారం అందంగా, యవ్వనంలో ఉన్నంత ఆకర్షణీయంగా కనిపిస్తుంది.

ట్రాన్స్‌ప్లాంటేషన్‌తో బట్టతల మాత్రమే కాదు దెబ్బలు, సర్జరీలాంటివి జరిగిన ప్రదేశంలో ఏర్పడిన ఖాళీలను కూడా పూరిస్తుంది.

మందులు, ఇతరత్రా చికిత్సలు పనిచేయని చోట ట్రాన్స్‌ప్లాంటేషన్



మెరుగైన ఫలితం ఇస్తుంది.

అలాగని, హెయిర్ ట్రాన్స్‌ప్లాంటేషన్ నిర్ణయం చిటికెలో తీసుకునేది కాదు. చర్మవైద్యుడిని, ఆపై సర్జన్‌ని సంప్రదించిన తర్వాత ఆలోచించాకే సర్జరీకి వెళ్లాలి.

# ప్రధాని మోదీ మెచ్చిన అడవి పండు! ఎన్ని ప్రయోజనాలో తెలుసా..!

మోదీ మెచ్చిన అడవి పండు ఏంటీ అనుకుంటున్నారా!. అదేనండి ఉత్తరాఖండ్‌కి చెందిన కఫాల్ ఫ్రూట్. ఏంటీ పేరే అలా ఉంది అనుకోకండి. ఎందుకంటే దీని వల్ల ఎన్నో ఆరోగ్య ప్రయోజనాలు ఉన్నాయట. సాక్షాత్తు ప్రధాని మోదీ సైతం ఈ పండు ప్రయోజనాలు చూసి ఫిదా అయ్యారంటే.. అది ఎంత విలువైనదనేది ప్రత్యేకంగా చెప్పాల్సిన పనిలేదు. ఆ ఫ్రూట్ ఎలా ఉంటుంది? దానివల్ల ఎన్ని ఆరోగ్య ప్రయోజనాలు ఉన్నాయో తెలుసా!

ఉత్తరాఖండ్ సీఎం పుష్కర్ సింగ్ ధామి ఒకనొక సందర్భంలో ఓ బుట్టడు కఫాల్ పండ్లు పంపడంతో మోదీ తెగ సంబరపడిపోయారు. అంతేగాదు ఉత్తరాఖండ్ సీఎం ధామికి లేఖ రాసి మరీ ఆ పండు పంపినందుకు కృతజ్ఞతలు తెలిపారు. ఇంకా ఆ లేఖలో మోదీ.. "ఉత్తరాఖండ్ సంస్కృతిలో 'కఫాల్' పాతుకు పోయింది. ఆ ప్రాంత జానపద పాటల్లో కూడా ఆ ప్రస్తావన ఉంది. పెరగిన ఆర్థిక పరిస్థితుల దృష్ట్యా ఈ పండు ప్రజలకు ఎన్నో ఆరోగ్య ప్రయోజనాలందించే విలువైన పండుగా ఉంది" అని పేర్కొన్నారు. ఆ పండు చూడటానికి కూడా ఆకర్షణగా ఉంటుంది

పండు ఎలా ఉంటుదంటే..



ఉత్తరాఖండ్‌లో దట్టమైన అటవీ ప్రాంతాల్లో ఈ అడవి పండు లబిస్తుంది. భారతదేశంలోని ఇతర ప్రాంత ప్రజలు వేసవిలో మామిడిని ఎంతో ఇష్టంగా ఆస్వాదిసత?ఏ..ఉత్తరాఖండ్ ప్రజలు ఈ కఫాల్ పండ్లను ఆస్వాదిస్తారు. వారు పెద్ద మొత్తంలో వీటిని కొనుగోలు చేస్తారు. అయితే ఇవి రెండు రోజుల్లోనే పాడైపోతాయి. ఎక్కువ రోజులు తాజాగా ఉంచడం సాధ్యపడుదు. వాళ్లు వీటిని ఎండబెట్టి కూరల్లో, లేదా పానీయంగా తయారు చేసుకుని ఆస్వాదిస్తుంటారు.

# సైకిల్ సవారీతో కుంగుబాటు పరార్!

పాల ప్యాకెట్ తేవడానికి బైక్, కూరగాయలు తీసుకురావడానికి కారు తీస్తున్నాం. ఊళ్లో ఉన్న చుట్టాల ఇంటికి వెళ్లాలన్నా ఆటో బుక్ చేస్తున్నాం. రవాణా సౌకర్యాలు మెరుగవ్వడంతో సైకిల్ సవారీని మర్చిపోయారంతా! మరోవైపు ఇంధన వినియోగం పెరగడంతో పర్యావరణానికీ ముప్పు తప్పడం లేదు. అయితే, సైక్లింగ్ పరిసరాలకు మాత్రమే కాదు మన మానసిక ఆరోగ్యానికి కూడా ఉపకరిస్తుందని తాజా పరిశోధన ఒకటి వెల్లడించింది. చిన్నచిన్న పనులకు ఇతర వాహనాల మీద వెళ్లే వాళ్లతో పోలిస్తే.. సైకిల్ సవారీ చేసే వ్యక్తుల విషయంలో ఆందోళన, కుంగుబాటు చికిత్సకు సూచించే మందుల మోతాదు తక్కువగా ఉంటుందని ఈ పరిశోధన నిరూపించింది. 'ఇంటర్‌నేషనల్ జర్నల్ ఆఫ్ ఎపిడెమియాలజీ'లో ఈ పరిశోధన ప్రచురితమైంది. రీసెర్చ్‌లో భాగంగా స్కాట్లాండ్‌కు చెందిన 16 74 మధ్య వయస్కులైన 3,78,253 మందికి సంబంధించిన ఐదేండ్ల సమాచారాన్ని విశ్లేషించారు. ఇల్లు, పని ప్రదేశాల మధ్య సైకిల్ ప్రయాణం.. మానసిక ఆరోగ్య సమస్యల ముప్పును తగ్గిస్తుందని గుర్తించారు. అయితే, పరిశోధనకు ఎంచుకున్న వారిలో చాలామంది ఇల్లు, పని ప్రదేశం ఒక కిలోమీటర్ పరిధిలో ఉండటం



గమనార్హం. ఇలా ఉంటే అధ్యయనం మొదలుపెట్టే నాటికి వీరిలో ఎవ్వరికీ మానసిక సమస్యలు లేవట. ఐదేండ్ల తర్వాత కుంగుబాటు, ఆందోళనకు మందులు తీసుకునే అవసరం మిగిలిన వాళ్లతో పోలిస్తే సైకిల్ మీద వెళ్లేవాళ్లకు 15 శాతం తక్కువగా ఉన్నట్టు తేలింది. మొత్తంగా సైక్లింగ్‌తో శారీరక వ్యాయామంతోపాటు మానసిక బలం కూడా చేకూరుతుందని పరిశోధన సారాంశం.

# మధుమేహులకు అనువైన సమ్మర్ డ్రింక్స్ ఇవే..!

మార్చిలోనే భానుడి ప్రతాపంతో ఎండ తాకిడి మొదలైంది. మధ్యాహ్న సమయంలో బయటకు రావాలంటే ప్రజలు భయపడే పరిస్థితి. వేసవి తాపం తీర్చుకునేందుకు జనం పండ్ల రసాలు వంటివి తీసుకోవడం సహజం. అయితే మధుమేహులు తమ షుగర్ లెవెల్స్ పెంచని సమ్మర్ డ్రింక్స్‌ను ఎంచుకోవడం మేలు. ఎలాంటి పరిస్థితులోనూ పండ్ల నుంచి తీసిన రసాన్ని మధుమేహులు తీసుకోరాదని బెంగళూర్‌కు చెందిన డైటీషియన్ నిధి నిగం హెచ్చరిస్తున్నారు. ఫ్రూట్ జ్యూస్‌లో పండులో ఉన్నంత ఫైబర్ ఉండదని దీంతో వెనువెంటనే షుగర్ లెవెల్స్ పెరిగే ప్రమాదం ఉందని అన్నారు. అయితే ప్రత్యామ్నాయ సమ్మర్ పానీయాలతో మధుమేహులు తమ దాహార్తి తీర్చుకోవచ్చని సూచిస్తున్నారు. డయాబెటిక్‌తో బాధపడేవారు వారి షుగర్ లెవెల్స్ పెరగకుండానే హైడ్రేట్‌గా ఉండేందుకు ఇంటి నుంచే కొన్ని సహజసిద్ధమైన, ఆరోగ్యకర కూలింగ్ డ్రింక్స్ తయారుచేసుకోవచ్చని డైటీషియన్ కవితా దేవ్‌గన్ చెబుతున్నారు. భోజనానికి ముందు ఈ సమ్మర్ డ్రింక్స్ తీసుకోవాలని న్యూట్రిషనిస్టులు సూచిస్తున్నారు.

Editor,Printer, Publisher & Owner by **Reddy Shekar**,3-184, venkatapur, (m) venkatapur, mulugu dist, 506352, Printed at 16-48 **SS Printers,** (m) mulugu, mulugu. RNI NO:- TELTEL 02048/2021, **E Mail : teenmaardesk@gmail.com, Cell : 9177108128**